
# మణిద్వీప వర్ణన



ఋషిపీఠం ప్రచురణ

# మణిద్వీప వర్ణన




ఋషిపీఠం ప్రచురణ




# మణిద్వీప వర్ణన

**ప్రథమ ముద్రణ:**
జనవరి, 2012

**ద్వితీయ ముద్రణ:**
డిశంబర్, 2013

**వెల:** రూ. 10/-

**డిజైనింగ్ :** రాము.పి

**ప్రచురణ:**
**ఋషిపీఠం**
**రిజిష్టర్డ్ ఆఫీస్:** శ్రీలలితా ధామమ్,
ప్లాట్ నెం. 299/300. ఫేస్-1, సాకెత్ కాలనీ,
ఇ.సి.ఐ.ఎల్. సికింద్రాబాద్.
ఫోన్: 040-27132550






**జ**గదంబాలోకం మణిద్వీపం.
అనన్య దేవీ భక్తులకు అమ్మ అనుగ్రహించే పరంధామం. తాత్త్వికంగా పరిశీలిస్తే మనలోనున్న వివిధ ప్రకృతి భూమికలను చైతన్యవంతం చేస్తూ, వాటికి అతీతంగా ఉండే పరబ్రహ్మతత్త్వమే, ఇక్కడ సగుణంగా, సాకారంగా, ధ్యానయోగ్యంగా వర్ణింపబడింది.

ఈ 'మణిద్వీప వర్ణన' యొక్క ప్రభావం, ఫలశ్రుతిలో చెప్పబడింది. ఐహిక ఫలాలనేకాక, పారమార్థిక జ్ఞానాన్ని ప్రసాదించే శక్తిమంతమైన ఈ ఘట్టం – 'దేవీ భాగవతం' లోనిది. దేవీభక్తుల నిత్యపారాయణకు, మననాదుల సౌకర్యానికై సేకరించి, 'ఋషిపీఠం' సమర్పణగా అందిస్తున్నాం.

ఈ గ్రంథాన్ని ప్రచురించడంలో ముందుకు వచ్చిన శ్రీ కావూరి వేంకటకామేశ్వర్, శ్రీమతి కావూరి అనూరాధ దంపతులకు జగదంబా కటాక్షాలు లభించాలని ప్రార్థిస్తూ... అభినందనలు.

–సామవేదం షణ్ముఖశర్మ




# మణిద్వీప వర్ణన

బ్రహ్మలోకా దూర్ధ్వభాగే సర్వలోకోస్తియః శ్రుతా।
మణిద్వీపః స ఏవాస్తి యత్ర దేవీవిరాజతే॥
సర్వస్మా దధికో యస్మాత్ సర్వలోకస్తతః స్మృతః।
పురా పరాంశయై వాయం కల్పితో మనసేచ్ఛయా॥
సర్వాదౌ నిజవాసార్థం ప్రకృత్యా మూలభూతయా।
కైలాసా దధికో లోకో వైకుంఠా దపి చోత్తమః.
గోలోకాదపి సర్వస్మా త్సర్వలోకోఽధికః స్మృతః।
న తత్సమం త్రిలోక్యాం తు సుందరంవిద్యతే క్వచిత్.
ఛత్రీభూతం త్రిజగతో భవసంతాపనాశకమ్।
ఛాయాభూతం తదేవాస్తి బ్రహ్మాండానాంతు సత్తమ.
బహుయోజన విస్తీర్ణో గభీర స్తావదేవ హి।
మణిద్వీపస్య పరితో వర్తతే తు సుధోదధిః.
మరుత్సంఘట్టనోత్కీర్ణ తరంగశత సంకులః।
రత్నాచ్ఛవాలుకాయుక్తో ఝషశంఖ సమాకులః
వీచిసంఘర్ష సంజాత లహరీకణ శీతలః।
నానా ధ్వజసమాయుక్త నానాపోతగతాగతైః.

శ్రీవ్యాసుని వచనం: బ్రహ్మలోకానికి పైని సర్వలోకం విరాజిల్లుతుంటుంది. దానినే మణిద్వీపమని అంటారు. అందులో శ్రీత్రిభువనేశ్వరీదేవి ప్రకాశిస్తుంది. అన్ని లోకాల కన్న అధికమైనది కావడంవలన మణిద్వీపాన్ని సర్వలోకమని అంటారు. శ్రీ పరాంబిక దానిని తన సంకల్ప మాత్రం చేతనే నిర్మించింది. శ్రీమూలపకృతి దేవి ఈ సకల సృష్టికి పూర్వం మణిద్వీపాన్ని తన నివాసంగా ఏర్పరచుకొన్నది. అది కైలాసం కన్న మిన్నగా, వైకుంఠం కంటె ఉత్తమంగా, గోలోకం కంటె శ్రేష్ఠంగా ఒప్పుతున్నది. కనుకనే దానిని సర్వలోకం అంటారు.




ఈ మూడులోకాల్లోనూ దానిని మించి సుందరతరమైన నగరం ఇంకొకటి లేనేలేదు. అది ముజ్జగాలకు గొడుగు వంటిది. సంసార సంతాపాన్ని నశింప జేసేది. బ్రహ్మాండా లన్నిటికీ చల్లని నీడ వంటిది. ఇది ఎన్ని ఆమడల వైశాల్యం కలదో అంత గంభీర మైనది. ఆ మణిద్వీపానికి నాలుగువైపులా అమృత సముద్రం విల సిల్లుతుంటుంది. అందులో గాలి తాకిడులకు ఉవ్వెత్తుగా లేచే చల్లని కెరటాలు, రతనాల యిసుక ప్రదేశాలు, దక్షిణావర్తం మొదలైన వివిధ శంఖాలు, అనేక వర్ణాల చేపలు కనువిందు చేస్తాయి. అందులో తరంగాల వరుసలచే కలిగిన చల్లని నీటి తుంపరలు, వివిధములైన టెక్కెముల టెక్కుతో అటు ఇటు పయనించే అందాల పడవలు అందులో శోభలు వెలారుస్తుంటాయి. ఆ పొడవైన తీరాలలో కనులకింపైన సొంపైన బంగారు చెట్ల వరుసలున్నాయి.

## 1. కాలాయస ప్రాకారం:

**విరాజమానః పరిత స్తీరరత్న ద్రుమో మహాన్।**
**తదుత్తరమయోధాతు ర్నిర్మితో గగనే తలః.**
**సప్తయోజన విస్తీర్ణః ప్రాకారో వర్తతే మహాన్।**
**నానాశస్త్ర ప్రహరణా నానాయుద్ధవిశారదాః.**
**రక్షకా నివసంత్యత్ర మోదమానాః సమంతతః।**
**చతుర్ద్వార సమాయుక్తో ద్వారపాల శతాన్వితః.**
**నానాగణైః పరివృతో దేవీభక్తియుతైర్నృప।**
**దర్శనార్థం సమాయాంతి యే దేవా జగదీశితుః.**
**తేషాం గణా వసంత్యత్ర వాహనాని చ తత్రహి।**
**విమానశత సంఘర్ష ఘంటా స్వనసమాకులః.**
**హయహేషా ఖురాఘాత బధిరీకృత దిఙ్ముఖః।**
**గణైః కిలకిలారావై ర్వేత్రహస్తైశ్చ తాడితాః.**
**సేవకా దేవసంఘానాం భ్రాజంతే తత్ర భూమిప।**
**తస్మిన్కోలాహలే రాజ న్న శబ్దః కేనచి త్క్వచిత్.**
**కస్యచిచ్ఛ్రూయతేఽ త్యంత నానాధ్వనిసమాకులే।**
**పదేపదే మిష్టవారి పరిపూర్ణ సరాంసి చ.**
**వాటికా వివిధా రాజన్ రత్నద్రుమవిరాజితాః।**

వానికి ఆవల ఇనుముతో నిర్మించబడి ఏడామడల ఎత్తుగల దృఢప్రాకారం ఉన్నది.




అందులో అనేక శస్త్రాస్త్రాలు ఉపయోగించి యుద్ధంచేయడంలో నేర్పరులైన రక్షకులు వీరోత్సాహంతో నివసిస్తుంటారు. దానికి నాలుగు ద్వారాలున్నాయి. ప్రతి ద్వారమందు వందల కొలది ద్వారపాలకులు కాపుంటారు. అందులో దేవీభక్తులు గణాలుగా నివసిస్తారు. వారెప్పుడు జగదీశ్వరీదేవి దివ్య దర్శనానికి వస్తుంటారు. ఆ దేవీభక్తులు తమ తమ దివ్య వాహనాలపై వస్తారు. వారి వేలాది విమానాల గంటల చప్పుళ్ళు వారి గుఱ్ఱాల సకిలింపులు, వాని డెక్కల టక-టక ధ్వనులు దిక్కులకు చెవుడు పట్టేలా మారు మ్రోగుతుంటాయి. అచట దేవీ జనములు దండముల చేతబూని కిలకిలారావాలు చేస్తూ గోల చేయవద్దంటూ దేవసేవకులను మోదుతుంటారు. రాజా! ఆ కోలాహలం నడుమ ఎవడేమి చప్పుడు చేసాడో తెలుసుకొనే వీలు కాదు. అంత మహాధ్వనిలో ఒకరిమాట ఇంకొకరికి వినిపించదు. అక్కడ అడుగడుగునా చల్లని తీయని కొలంకులు స్వచ్ఛంగా ఉన్నాయి. అచ్చట రత్నమయ తరువులతో తనరారే ఉద్యానాలున్నాయి.

## 2. కాంస్యప్రాకారం (నానావృక్షమహోద్యానం):

**తదుత్తరం మహాసారధాతు ర్నిర్మిత మండలః.**

**సాలో౭వరో మహానస్తి గగనస్పర్శి యచ్ఛిరః।**

**తేజసా స్యా చ్ఛతగుణః పూర్వశాలాదయం పరః.**

**గోపుర ద్వారసహితో బహువృక్ష సమన్వితః।**

**యా వృక్ష జాతయః సంతి సర్వా స్తా స్తత్ర సంతి చ.**

**నిరంతరం పుష్పయుతాః సదాఫల సమన్వితాః।**

**నవపల్లవ సంయుక్తా వరసౌరభ సంకులాః.**

**పనసా వకులా లోధ్రాః కర్ణికారాశ్చ శింశుపాః।**

**దేవదారూ కాంచనారా ఆమ్రాశ్చైవ సుమేరవః.**

**లికుచా హింగులాశ్చైలా లవంగాః కట్ఫలా స్తథా।**

**పాటలా ముచుకుందాశ్చ ఫలిన్యో జఘునేఫలాః.**

**తాలాస్తమాలాః సాలాశ్చ కంకోలా నాగభద్రకాః।**

**పున్నాగాః పీలవః సాల్వకావై కర్పూరశాఖినః.**

**అశ్వకర్ణా హస్తికర్ణా స్తాలపర్ణాశ్చ దాడిమాః।**

**గణికా బంధుజీవాశ్చ జంబీరాశ్చ కురండకాః.**


**చాంపేయా బంధుజీవాశ్చ తథా వై కనకద్రుమాః।**

**కాలాగురు ద్రుమాశ్చైవ తథా చందన పాదపాః.**




**ఖర్జూరా యూథికా స్తాలపర్ణ్య శ్చైవ తథేక్షవః।**
**క్షీరవృక్షాశ్చ ఖదిరా శ్చించా భల్లాతకా స్తథా.**
**రుచకాః కుటజా వృక్షా బిల్వవృక్షా స్తథైవ చ।**
**తులసీనాం వనాన్యేవం మల్లికానాం తథైవ చ.**
**ఇత్యాదితరుజాతీనాం వనాన్యుపవనాని చ।**
**నానావాపీశతై ర్యుక్తా న్యేవం సంతి ధరాధిప.**
**కోకిలారావ సంయుక్తా గుంజ ద్భ్రమరభూషితాః।**
**నిర్యాస స్రావిణః సర్వే స్నిగ్ధచ్ఛాయా స్తరూత్తమాః.**
**నానా ఋతుభవా వృక్షా నానాపక్షి సమాకులాః।**
**నానారస స్రావిణీభి ర్నదీభి రతిశోభితాః.**
**పారావత శుకవ్రాత సారికా పక్షమారుతైః।**
**హంసపక్ష సముద్భూతా వాతవ్రాతైశ్చలద్రుమమ్.**
**సుగంధగ్రాహి పవనపూరితం తద్వనోత్తమమ్।**
**మహితం హరిణీయూథై ర్ధావమానైరిత స్తతః.**
**నృత్య ద్బర్హి కదంబస్య కేకారావైః**
**సుఖప్రదైః। నాదితం తద్వనం దివ్యం మధు స్రావి సమంతతః.**

దానికి ఎగువ లోపలి వైపున మహాసార (కంచు) ధాతువుతో నిర్మితమైన పెద్ద సాలము కలదు. ఈ కంచు ప్రాకారం గగనమును తాకేలా ఉంటుంది. ఇది ఇనుప ప్రాకారము కన్న నూరురెట్లు గొప్పది. కంచు ప్రాకారపు గోపుర ద్వారాలు చాలా ఎత్తుగా ఉన్నాయి. చెట్లలో ఎన్ని జాతులు కలవో అన్ని జాతుల చెట్లు అక్కడ గలవు. ఆ చెట్లకు ఎల్లవేళలా కొంగ్రొత్త లేజిగుళ్ళును, కమ్మని వాసనలు రంగురంగుల పూల గుత్తులు, తీయని పండ్లు విలసిల్లుతుంటాయి. అచట పనస వకుళ లోధ్ర కర్ణికార శింశుపా దేవదారు కాంచనార చూత నమేరు లికుచ హింగులైలా లవంగ కట్ఫల పాటల ముచుకుంద ఫలినీ జఘనేఫల తాల తమాల సాల కంకోల నాగభద్ర పున్నాగ పీలు సాల్వక కర్పూరాశ్వకర్ణ హస్తికర్ణ తాలపర్ణ దాడిమీ గణికా బంధుజీవక జంబీర కురండక చాంపేయ బంధుజీవ కనక ద్రుమ కాలాగురు చందన ఖర్జూర యూథికా తాలపర్ణీక్షు క్షీరవృక్ష ఖదిర చించా భల్లాతక రుచక కుటజ బిల్వ తులసీ మల్లికాది వృక్షాలు గల మనోహరమైన తోటలున్నాయి. ఈ విధంగా అచట పలు విధములైన వృక్షాలు, వనాలు, ఉపవనాలు, వందల కొలది దిగుడు బావులు ఎంతో అందంగా ఒప్పారుతుంటాయి. ఆ చెట్లపై కూసే కోయిలలు కుహూ




నాదాలు, గండుతుమ్మెదల ఝుంకారాలు వీనులవిందు చేస్తాయి. చెట్లు దట్టమైన చల్లని నీడ నిస్తాయి. ఆయా చెట్లు అనేక రకాల పక్షులకు నివాస యోగ్యములు; పలు రసములు ప్రవహించే నదుల తీర భూములందు సొంపు మీరు తుంటాయి. చిలుకలు, గోరువంకలు, పావురాలు, రాయంచలు మొదలైన పక్షుల రెక్కల గాలులచే చెట్లకొమ్మ లూగుతుంటాయి. ఇటువంటి చెట్లు సువాసనలు విరజిమ్మె గాలులతో అచటి వనాలు పరి మళాలు గుబాళిస్తాయి. ఆ వనములందు జింకల గుంపులు ఇటు అటు బిత్తరిగంతులు వేస్తుంటాయి. అక్కడ నెమళ్ల గుంపులు నర్తిస్తుంటాయి. వాని తీయని కేకారవములు అన్ని దిశలకు వ్యాపిస్తాయి. ఈ విధంగా మణిద్వీపమందు సుఖదాయకమై మధురరావములు గల్గి తేనెలు స్రవించే చెట్లతో వనాలు అలరారుతుంటాయి.

## 3. తామ్రప్రాకారం- (కల్పవాటిక):

**కాంస్యసాలా దుత్తరే తు తామ్రసాలః ప్రకీర్తితః।**
**చతురస్రసమాకార ఉన్నత్యా సప్తయోజనః.**
**ద్వయోస్తు సాలయో ర్మధ్యే సంప్రోక్తా కల్పవాటికా।**
**యేషాం తరూణాం పుష్పాణి కాంచనాభాని భూమివ.**
**పత్రాణి కాంచనాభాని రత్నబీజఫలాని చ।**
**దశయోజనగంధోహి ప్రసర్పతి సమంతతః.**
**తద్వనం రక్షితం రాజ స్వసంతేన ర్తునానిశమ్।**
**పుష్పసింహాసనాసీనః పుష్పచ్ఛత్రవిరాజితః.**
**పుష్పభూషాభూషిత శ్చ పుష్పాసవ విఘూర్ణితః।**
**మధుశ్రీర్మాధవశ్రీ శ్చ ద్వేభార్యే తస్య సమ్మతే.**
**క్రీడతః స్మేరవదనే సుమస్తబకకందుకైః।**
**అతీవ రమ్యం విపినం మధుస్రావి సమంతతః.**
**దశయోజనపర్యంతం కుసుమామోదవాయునా।**
**పరీతం దివ్య గంధర్వైః సాంగనై ర్గానలోలుపైః.**
**శోభితం తద్వనం దివ్యం మత్త కోకిలనాదితం।**
**వసంతలక్ష్మీ సంయుక్తం కామికామప్రవర్ధనమ్.**

ఆ కంచు ప్రాకారానికి ఎగువగా లోపలి వైపున రాగి ప్రాకారం కలదు. అది చతుర స్రాకారంగా ఏడామడల ఎత్తులో ఉంటుంది. కంచు-రాగి ప్రాకారాల మధ్యలో కల్ప వనాలున్నాయి. ఆ చెట్ల పూవులు సువర్ణ పుష్పాలవలె కాంతులతో సొబగు లీనుతుంటాయి.

వాని ఆకులు–బంగారు రేకులుగా, బీజఫలాలు– రత్నాల వలె సొంపు గూర్చుతుంటాయి. ఆ చెట్ల కమ్మని పరిమళాల కెరటాలు పది ఆమడల వరకు వ్యాపిస్తాయి.

రాజా! ఆ కల్పవనాలందు వసంతరాజు రేయింబవళ్ళు కొలువై వసంతశోభలు వెలార్చుతాడు. వసంతరాజు పూల గొడుగుల క్రింద పూగద్దెపై విరాజిల్లుతుంటాడు. అతడు పూలసొమ్ములు దాల్చి పూతేనియలు గ్రోలి మత్తెక్కియుంటాడు. అతని భార్యలు మధుశ్రీ–మాధవశ్రీలు. వారు నిరంతరం లేనగవులు గుమ్మరిస్తారు.

వసంతరాజు తన రాణులను గూడి వలపు పూగుత్తుల బంతులతో ఆడు తుంటాడు. ఇలా తేనియలు జాలువారే కల్పకవనం ఎంతో సమ్మోదం కూర్చు తుంది. ఈ తోటలోని కమ్మని తెమ్మెరలు– చుట్టూ పదామడలు వ్యాపిస్తాయి. ఆ పూల వాసనలు గుబుల్కొనగా వనమందు గానలాలసలైన గంధర్వ కామినులు కౌగిళ్లలో గంధర్వ యువకులు సయ్యాటలాడుతుంటారు.

ఆ దివ్యవనం మత్తకోయిలల కలరావాలతో వసంతశ్రీల శోభలతో కాముకులలో తలపులు రేపుతుంటుంది.

## 4. సీసప్రాకారం– (సంతానవాటిక):

**తామ్రసాలా దుత్తరత్ర సీససాలః ప్రకీర్తితః।**
**సముచ్ఛ్రాయః స్మృతోఽ ప్యస్య సప్తయోజన సంఖ్యయా.**
**సంతానవాటికామధ్యే సాలయోస్తు ద్వయో ర్నృప।**
**దశయోజన గంధస్తు ప్రసూనానాం సమంతతః.**
**హిరణ్యాభాని కుసుమా న్యుత్ఫుల్లాని నిరంతరమ్।**
**అమృత ద్రవ సంయుక్త ఫలాని మధురాణి చ.**
**గ్రీష్మర్తు ర్నాయకస్తస్యా వాటికాయా నృపోత్తమ।**
**శుక్రశ్రీశ్చ శుచిశ్రీ శ్చ ద్వేభార్యే జనసంమతే.**
**సంతాపత్రస్తలోకాస్తు వృక్షమూలేషు సంస్థితాః।**
**నానాసిద్ధైః పరివృతో నానాదేవైః సమన్వితః.**
**విలాసినీనాం బృందైస్తు చందన ద్రవ పంకిలైః।**
**పుష్పమాలా భూషితై స్తు తాలవృంత కరాంబుజైః.**

రాగి ప్రాకారానికి ఎగువగా లోపలి వైపున సీస ప్రాకారం కలదు.

అది ఏడామడల ఎత్తున అలరారుతున్నది. రాగి సీసపు ప్రాకారాల నడుమ సంతానవాటిక




గలదు. అందలి పూలతెమ్మెరల కెరటాలు పదామడలు వరకు వ్యాపిస్తాయి. అందలి పూవులు- బంగారు కాంతులీనుతూ ఎల్లవేళలా విప్పారియే ఉంటాయి.

అందలి ఫలాలు మధుర రసములై తీయగా ఉంటాయి. సంతానవాటికకు గ్రీష్మఋతువు నాయకుడు. అతని భార్యలు శుక్రశ్రీ, శుచిశ్రీలు.

సంసార తాపాలకు భయపడినవారు ఆ వృక్షాల మొదట శాంతిగా విశ్రమిస్తారు. అచట ఎందరో దేవతలు, సిద్ధులు నివాసముంటారు.

అచ్చోట ఒంటికి చందనాలలదుకొని, పూలమాలలు మెడ దాల్చి, తాటాకు విసనకఱ్ఱలు చేత బూని నవవిలాసినులు గుంపులు గుంపులుగా ఒయ్యారము లొలుక బోస్తారు.

## 5. ఆరకూట (ఇత్తడి ప్రాకారం)- హరిచందన:

**ప్రాకారః శోభితో రాజన్ శీతలాంబునిషేవిభిః।**
**సీససాలా దుత్తరత్రాప్యారకూటమయః శుభః.**
**ప్రాకారో వర్తతే రాజ న్మునియోజనదైర్ఘ్యవాన్।**
**హరిచందన వృక్షాణాం వాటీ మధ్యే తయోః స్మృతా.**
**సాలయో రధినాథ స్తు వర్షర్తుర్మేఘవాహనః।**
**విద్యుత్పింగలనేత్రశ్చ జీమూతకవచః స్మృతః.**
**వజ్రనిర్ఘోషముఖర శ్చేంద్రధన్వా సమంతతః।**
**సహస్రశోవారిధారా ముంచన్నాస్తే గణా గ్రతః.**
**నభః శ్రీశ్చ నభస్యశ్రీః స్వరస్యా రస్యమాలినీ।**
**అంబాదులా నిరత్నిశ్చా భ్రమంతీ మేఘయంతికా.**
**వర్షయంతీ చిపుణికా వారిధారా చ సమంతాః।**
**వర్షర్తో ర్ద్వాదశప్రోక్తాః శక్తయో మదవిహ్వలాః.**
**నవపల్లవ వృక్షాశ్చ నవీనలతికాన్వితాః।**
**హరితాని తృణాన్యేవ వేష్టితా యై ర్ధరాఽఖిలా.**
**నదీనద ప్రవాహా శ్చ ప్రవహంతి చ వేగతః।**
**సరాంసి కలుషాంబూని రాగిచిత్తసమాని చ.**
**వసంతి దేవాః సిద్ధా శ్చ యే దేవీ కర్మకారిణః।**
**వాపీకూపతటాకా శ్చ యే దేవ్యర్థే సమర్పితాః.**
**తే గణా నివసంత్యత్ర సవిలాసా శ్చ సాంగనాః।**




రాజా! అచట ప్రాణులు చల్లని మంచి తీర్థములు గ్రోలుతారు. ఆ సీసపు ప్రాకారానికి ఎగువగా లోపలి వైపున అందమైన ఇత్తడి ప్రాకారం కలదు. ఇత్తడి ప్రాకారం ఏడామడల ఎత్తున గలదు. సీసపు, ఇత్తడి ప్రాకారముల నడుమ హరిచందన వృక్షాల వనాలు చెన్నొందు తుంటాయి. వానికి అధిపతి మేఘవాహనుడైన వర్ష ఋతువు. అతని కన్నులు మెఱపులవలె పింగళ వర్ణములు గలవి. అతని కవచం– మేఘముల గుంపు. అతడు వజ్రంలా గర్జిస్తూ ఇంద్రధనువు చేతబూని కుంభద్రోణంగా ఎల్లెడలా వర్షిస్తూ గణములను కూడియుంటాడు.

నభఃశ్రీ, నభస్యశ్రీ, స్వరస్య, రస్యమాలిని, అంబాదుల, నితంతి, భ్రమంతి, మేఘయంతిక, వర్షయంతి, చిపుణిక, వారిధార, మదవిహ్వల– అనేవారు వర్షఋతువునకు పన్నెండుమంది మదవతులైన శక్తులుగా పేరొందారు. ఆ చోటంతా కొంగ్రొత్తగా చిగురించిన చెట్ల వరుసలతో లేతదీగెలతో పచ్చని పైరులతో కన్నులపండువు చేస్తుంటుంది. అచటి నదీనదాలు నిరంతరం ప్రవాహవేగంతో హృదయానందం కూర్చుతాయి. కొలంకులందలి కలుషజలాలు రాగుల అంతరంగాలవలె చెన్నొందుతాయి.

అచ్చట శ్రీదేవి మహోత్సవాలు జరిపే సిద్ధులు, దేవతలు నివసిస్తారు. అచటి వాపీకూపాలు, తటాకాలు దేవిసేవకు వినియోగపడుతాయి. అచట ఆ గణములు విలాసినులైన తమ అంగనలను కూడి విహరిస్తారు.

## 6. పంచలోహ ప్రాకారం– (మందార వాటిక):

**అరకూటమయాదగ్రే సప్తయోజన దైర్ఘ్యవాన్.**
**పంచలోహాత్మకః సాలో మధ్యేమందారవాటిక।**
**నానాపుష్పలతాకీర్ణా నానాపల్లవశోభితా.**
**అధిష్ఠాతాఽత్ర సంప్రోక్తః శరదృతురనామయః।**
**ఇషలక్ష్మీ రూర్జలక్ష్మీ ర్ద్వేభార్యే తస్యసంమతే.**
**నానాసిద్ధా వసంత్యత్ర సాంగనాః సపరిచ్ఛదాః।**

ఆ ఇత్తడి ప్రాకారానికి ఎగువ వైపున లోపలగా ఏడామడల ఎత్తున పంచలోహాల ప్రాకారం ఉంది. ఇత్తడి పంచలోహాల ప్రాకారాల నడుమ మందారవనం చెలువొందుతుంటుంది. ఆ చెట్లు పూల తీగెలతో పలువిధాల ఎఱ్ఱని చిగుళ్లతో అందగిస్తాయి. ఏ రోగము లేని శరదృతువు దానికి అధిష్ఠాత. ఇషలక్ష్మీ, ఊర్జలక్ష్మీ అనేవారు శరదృతు భార్యలు. అచట సిద్ధులు తమ భార్యలతో కాపురాలు చేస్తుంటారు.




## 7. రౌప్యసాలం- (పారిజాతవాటిక) :

పంచలోహమయా దగ్రే సప్తయోజన దైర్ఘ్యవాన్.
దీప్యమానో మహీశృంగై ర్వర్తతే రౌప్యసాలకః।
పారిజాతాటవీ మధ్యే ప్రసూనస్తబకాన్వితా.
దశయోజన గంధీని కుసుమాని సమంతతః।
మోదయంతి గణాన్సర్వా న్యే దేవీకర్మకారిణః.
తత్రాధినాథః సంప్రోక్తో హేమంతర్తుర్మహోజ్జ్వలః।
సగణః సాయుధః సర్వాన్ రాగిణోరంజయన్నృప.
సహశ్రీ శ్చ సహస్యశ్రీ ర్ద్వే భార్యేతస్య సంమతే।
వసంతి తత్ర సిద్ధా శ్చ యే దేవీవ్రతకారిణః.

ఆ పంచలోహ ప్రాకారానికి ఎగువగా లోపలి వైపున ఏడామడల ఎత్తున ఎత్తైన శిఖరాలతో వెండి ప్రాకారం తళతళ మెరుస్తుంటుంది. అచటి పారిజాత వృక్షాలకు క్రొత్త పూగుత్తులు నెత్తావులీనుతుంటాయి. వాని పరిమళాలు పదామడల వరకు వ్యాపించి దేవీపూజలు చేసే భక్తులకు ప్రసన్నత చేకూర్చుతుంటాయి. రాజా! దానికి అధిపతి మహోజ్జ్వల మైన హేమంతఋతువు. అతడు తన గణాలతో ఆయుధాలతో అనురాగవతుల మనసులను పరవశింపజేస్తాడు. అతని భార్యలు సహఃశ్రీ, సహస్యశ్రీలు. అచట దేవీవ్రతం ఆచరించే సిద్ధులు నివసిస్తుంటారు.

## 8. హేమసాలం- (కదంబ వాటిక):

రౌప్యసాలమయా దగ్రే సప్తయోజనదైర్ఘ్యవాన్।
సౌవర్ణసాలః సంప్రోక్త స్తప్తహాటకకల్పితః.
మధ్యే కదంబవాటీతు పుష్ప పల్లవశోభితా।
కదంబమదిరాధారాః ప్రవర్తంతే సహస్రశః.
యాభిర్ని పీతపీతాభి ర్నిజానందోఽను భూయతే।
తత్రాధినాథః సంప్రోక్తః శైశిరర్తుర్మహోదయః.
తపఃశ్రీశ్చ తపస్యశ్రీర్ద్వే భార్యే తస్య సంమతే।
మోదమానః సహైతాభ్యాం వర్తతే శిశిరాకృతిః.
నానావిలాససంయుక్తో నానాగణ సమావృతః।
నివసంతి మహాసిద్ధాయే దేవీదానకారిణః.
నానాభోగసముత్పన్న మహానందసమన్వితాః।




**సాంగనాః పరివారై స్తు సంఘశః పరివారితాః.**

ఆ వెండి ప్రాకారానికి ఎగువగా లోపలి వైపున బంగారు ప్రాకారం క్రాగిన మేలిమి బంగారంతో ఏడామడల ఎత్తున వెలుగు తుంటుంది. వెండి, బంగారు ప్రాకారాల నడుమ పూలతో, చిగుళ్ళతో శోభిల్లే కదంబవనం కలదు. ఆ చెట్లనుండి కదంబమద్యము వేలధారలుగా స్రవిస్తుంటుంది. ఆ రసధారలు స్వేచ్ఛగా క్రోలుట వలన ఆత్మానందం కలుగుతుంది. దానికి అధిపతి శిశిరర్తువు.

అతని భార్యలు తపఃశ్రీ, తపస్యశ్రీలు. శిశిరర్తువు వారిని గూడి అంతటా ప్రమోది స్తుంటాడు. అక్కడ మహాసిద్ధులు పలు విధాల గణాలతో హావభావవిలా సాలతో కూడి దేవీ ప్రీతిగా దానాలివ్వడానికి సిద్ధంగా ఉంటారు. వారు తమ తమ రమణులతో కాపురాలు చేస్తూ సుఖభోగము అనుభవిస్తూ సంతోషంగా ఉంటారు.

## 9. పుష్పరాగప్రాకారం:

**స్వర్ణసాలమయా దగ్రే మునియోజన దైర్ఘ్యవాన్।**
**పుష్పరాగమయః సాలః కుంకుమారుణ విగ్రహః.**
**పుష్పరాగమయీ భూమిర్వనాన్యుపవనాని చ।**
**రత్నవృక్షాలవాలాశ్చ పుష్పరాగమయాః స్మృతాః.**
**ప్రాకారో యస్య రత్నస్య తద్రత్నరచితా ద్రుమాః।**
**వనభూః పక్షిణశ్చైవ రత్నవర్ణజలాని చ.**
**మండపా మండపస్తంభాః సరాంసి కమలాని చ।**
**ప్రాకారే తత్ర యద్యత్స్యాత్తత్సర్వం తత్సమం భవేత్.**
**పరిభాషేయ ముద్దిష్టా రత్నశాలాధిషు ప్రభో।**
**తేజసాస్యాల్లక్షగుణః పూర్వసాలాత్పరో నృప.**
**దిక్పాలా నివసంత్యత్ర ప్రతిబ్రహ్మాండ వర్తినామ్।**
**దిక్పాలానాం సమష్ట్యాత్మరూపాః స్ఫూర్జద్వరాయుధాః.**

ఆ బంగారు ప్రాకారానికి ఎగువగా లోపలి వైపున ఏడామడల ఎత్తున పుష్పరాగమణుల ప్రాకారం చెన్నొందుతుంది. అది ఎఱ్ఱకుంకుమవలె ఉంటుంది. అచటి నేల, వనాలు, ఉపవనాలన్నీ పుష్పరాగమయాలే. అచటి రత్నతరువులు పుష్పరాగపు చెట్లపాదులు అందంగా ఉంటాయి. అచట రత్న ప్రాకారం కలదు. దానిలోని చెట్లు, పక్షులు, వనభూములు, మండపాలు, స్తంభాలు, సరోవరాలు, కమలాలు అన్నీ రత్నమయాలే. రత్నప్రాకారం గూర్చి తెలిపాను. ఇది ఇతర ప్రాకారాల కన్న లక్షరెట్లుగా ప్రకాశిస్తుంటుంది. అచట




ప్రతి బ్రహ్మాండమందలి దిక్పతులైన ఇంద్రాదులు వరాయుధాలు దాల్చి దిక్పాల సమష్ట్యాత్మరూపంతో వెలుగొందుతుంటారు.

**పూర్వశాలం సముత్తుంగశృంగా పూరమరావతీ।**
**నానోపవనసంయుక్తా మహేంద్రస్తత్ర రాజతే.**
**స్వర్గశోభా చ యా స్వర్గే యావతీ స్యాత్తతోఽధికా।**
**సమష్టిశతనేత్రస్య సహస్రగుణతః స్మృతా.**
**ఐరావత సమారూఢో వజ్రహస్తః ప్రతాపవాన్।**
**దేవసేనాపరివృతో రాజతేఽత్ర శతక్రతుః.**
**దేవాంగనా గణయుతా శచీ తత్ర విరాజతే।**
**వహ్నికోణే వహ్నిపురీ వహ్నిపూః సదృశీ నృప.**
**స్వాహాస్వధా సమాయుక్తా వహ్నిస్తత్ర విరాజతే।**
**నిజవాహన భూషాఢ్యో నిజదేవగణై ర్వృతః.**
**యామ్యాశాయాం యమపురీ తత్ర దండధరో మహాన్।**
**స్వభటైర్వేష్టితో రాజన్ చిత్రగుప్త పురోగమైః.**
**నిజశక్తియుతో భాస్వత్తనయోఽస్తి యమో మహాన్।**
**నైరృత్యాం దిశి రాక్షస్యాం రాక్షసైః పరివారితః.**
**ఖడ్గధారీ స్ఫురన్నాస్తే నిర్ఋతి ర్నిజశక్తియుక్।**
**వారుణ్యాం వరుణోరాజా పాశధారీ ప్రతాపవాన్.**
**మహాఝుష సమారూఢో వారుణీమధు విహ్వలః।**
**నిజశక్తి సమాయుక్తో నిజయాదోగణాన్వితః**
**సమాస్తే వారుణే లోకే వరుణానీరతాకులః।**
**వాయుకోణే వాయులోకో వాయుస్తత్రాధితిష్ఠతి.**
**వాయుసాధన సంసిద్ధ యోగిభిః పరివారితః।**
**ధ్వజహస్తో విశాలాక్షో మృగవాహన సంస్థితః.**

ఆ ప్రదేశానికి తూర్పుగా ఎత్తైన శిఖరాలుగల అమరావతీ పట్టణం పలు విధాల వనాలతో అలరారుతుంది. అచట మహేంద్రుడు విరాజిల్లుతుంటాడు. అచట స్వర్గసీమ కన్న అధికమైన పరమశోభ వెలుగుతుంటుంది. అక్కడ వేల ఇంద్రుల తేజముగల మహేంద్రుడు వజ్రపాణియై ఐరావత మధిరోహించి దేవసేనలను కూడి గంభీరంగా వెలుగొందుతుంటాడు. ఇంద్రాణి దేవాంగనలను కూడియుంటుంది. దానికి ఆగ్నేయమునందు అగ్నిమయ




పట్టణమా అన్నట్లు అగ్నిపురం ప్రకాశిస్తుంటుంది.

అగ్ని అచట తన భార్యలైన స్వాహా స్వధాదేవులను కూడి తన వాహన భూషణ దేవగణాల తో వెలుగొందుతుంటాడు. దక్షిణ దిశయందు యమపురం కలదు. అందు యముడు దంఢదారియై చిత్రగుప్తుడు మొదలైన వారితో కూడియుంటాడు. అక్కడ సూర్యతనయుడైన యముడు తన శక్తితో గూడియుంటాడు. నైరృత దిశయందు రాక్షసులుంటారు. అక్కడ రాక్షసులను కూడి ఖడ్గధారియై నిరృతి తన శక్తితో వెలుగుతుంటాడు.

పడమట వరుణదేవుడు పాశపాణియై ప్రతాపియై ఒప్పుతుంటాడు. అతడు మహామత్స్యము నధిరోహించి వారుణీమదమత్తయైన తన శక్తినిగూడి జలజంతువులతో వారుణలోకమందు వరుణానితో జేరి రతిక్రీడల మునిగి తేలుతూ ప్రమోద మొందుతుంటాడు.

ఇక వాయవ్యమున వాయులోకంలో వాయుదేవుడు నివాసముంటాడు. అతడు వాయు సాధనమున సిద్ధులైన యోగులను గూడి ధ్వజహస్తుడు విశాలాక్షుడు మృగవాహనుడై చెలువొందుతాడు. అతడు తను మరుద్గణాలు సేవించగా తన శక్తిని కూడియుంటాడు.

**మరుద్గణైః పరివృతో నిజశక్తి సమన్వితః।**
**ఉత్తరస్యాం దిశి మహా న్యక్షలోకోఽస్తి భూమిప.**
**యక్షాధిరాజస్తత్రాఽఽస్తే వృద్ధి బుద్ధ్యాది శక్తిభిః।**
**నవభిర్నిధిభిర్యుక్త స్తుందిలో ధననాయకః.**
**మణిభద్రః పూర్ణభద్రో మణిమాన్మణికంధరః।**
**మణిభూషోమణిస్రగ్వీ మణికార్ముక ధారకః.**
**ఇత్యాదియక్షసేనానీసహితో నిజశక్తియుక్।**
**ఈశానకోణే సంప్రోక్తో రుద్రలోకో మహత్తరః.**
**అనర్ఘ్య రత్నఖచితో యత్ర రుద్రోఽధి దైవతమ్।**
**మన్యుమాన్దీప్తనయనో బద్ధపృష్ఠ మహేషుధిః.**
**స్ఫూర్జ ద్ధనుర్వామహస్తోఽధిజ్య ధన్వభి రావృతః।**
**స్వసమానై రసంఖ్యాతరుద్రైః శూలవరాయుధైః.**
**వికృతాస్యైః కరాలాస్యై ర్వమద్వహ్నిభిరాస్యతః।**
**దశహస్తైః శతకరైః సహస్రభుజ సంయుతైః.**
**దశపాదైర్దశగ్రీవై స్త్రినేత్రైరుగ్ర మూర్తిభిః।**
**అంతరిక్షచరా యే చ  యేచ భూమిచరాః స్మృతాః.**




**రుద్రాధ్యాయే స్మృతా రుద్రా స్తైః సర్వైశ్చ సమావృతః।**

**రుద్రాణీకోటిసహితో భద్రకాళ్యాది మాతృభిః.**

**నానాశక్తి సమావిష్ట డామర్యాదిగణావృతః।**

**వీరభద్రాదిసహితో రుద్రో రాజన్విరాజతే.**

**ముండమాలాధరో నాగవలయో నాగకంధరః।**

**వ్యాఘ్రచర్మపరీధానో గజచర్మోత్తరీయకః.**

**చితాభస్మానులిప్తాంగః ప్రమథాదిగణావృతః।**

**నినదడ్డమరుధ్వానైర్బధిరీకృతదిఙ్ముఖః.**

**అట్టహాసాస్ఫోటశబ్దైః సంత్రాసితనభ స్తలః।**

**భూతసంఘసమావిష్టో భూతావాసే మహేశ్వరః.**

**ఈశానదిక్పతిః సోఽయం నామ్నాచేశాన ఏవచ.**

**ఇతి శ్రీ దేవి భాగవతే మహాపురాణే ద్వాదశస్కంధే దశమోఽధ్యాయః.**

రాజా! ఉత్తరాన యక్షలోకం వెలుగొందుతుంటుంది. అచట వృద్ధి- ఋద్ధులనే శక్తులను గూడి యక్షరాజు విరాజిల్లుతుంటాడు. అతడు ధనపతి; నవనిధులకు అధిపతి; మణిభద్రుడు పూర్ణభద్రుడు మణిమంతుడు మణికంధరుడు మణిభూషుడు మణిమాలాధారి మణికార్ముకుడు మొదలైన యక్షసేనానులను గూడి కుబేరుడు తన శక్తితో అధిక సంపన్నుడై తేజరిల్లుతాడు. దానికి ఈశాన్యమున మహారుద్రలోకం విరాజిల్లుతుంటుంది. అది విలువైన రత్నాలతో నిర్మించబడినది.

అందులో మహారుద్రుడు స్వయంగా ప్రకాశిస్తుంటాడు. అతడు మహోగ్రుడు, దీప్తనయనుడు, మూపున అమ్ముల పొది దాల్చినవాడు. అతడు తన ఎడమచేత ప్రకాశించే ధనువు దాల్చి తనకు సరితూగగల అనేక రుద్రులతో చేరియుంటాడు. ఆ రుద్రులు వరాయుధాలను ధనువులను దాల్చియుంటారు.

వారి వికృత భీకర ముఖాలనుండి నిప్పులు కురుస్తుంటాయి. వారిలో కొందరు పది చేతులు, నూరు చేతులు, వేయి భుజాలు, పది పాదాలు, పది మెడలు, మూడు నేత్రాలు గలవారు భయంకర విగ్రహులై కొందరు నేలపై కొందరాకాశాన తిరుగుతుంటారు.

అచట రుద్రాధ్యాయమందు చెప్పబడిన రుద్రులు, మాతలు, పలు విధములైన శక్తులు, డామర్యాది గణములు వీరభద్రా దులను గలిసి మహారుద్రుడు కొలువై విరాజిల్లుతుంటాడు. అచట ముండమాలాధరుడు, నాగకంకణుడు, నాగకంఠుడు, పులితోలు దాల్చినవాడు, ఏనుగు తోలుత్తరీయంగా గలవాడు, చితాభస్మము మేనుల కలదుకొన్నవాడు, ప్రమథాది గణాలతో




కూడినవాడు, నినదించే డమరుమ్రోతలతో దిక్కులు పిక్కటిల్ల చేయువాడు, మహాట్టహాసంతో స్ఫోటశబ్దంతో నింగిని భయపెట్టేవాడు భూతసంఘాలతో కూడిన భూతావాసుడు అయిన మహేశ్వరుడు ఈశాన దిక్కునకు పతి అవడం వలన ఈశానుడనబడతాడు.

అతడు అష్టమూర్తి మహారుద్రుడై విరాజిల్లుతుంటాడు.

**ఇది శ్రీదేవి భాగవత మహాపురాణమందలి ద్వాదశ స్కంధమున దశమాధ్యాయం.**

**అథ ఏకాదశోఽధ్యాయః**

## 10. పద్మరాగమయ ప్రాకారం:

**వ్యాస ఉవాచ:**

**పుష్పరాగమయా దగ్రే కుంకుమారుణ విగ్రహః।**
**పద్మరాగమయః సాలో మధ్యే భూశ్చైవ తాదృశీ.**
**దశయోజనవాన్దైర్ఘ్యే గోపురద్వారసంయుతః।**
**తన్మణి స్తంభసంయుక్తా మండపాః శతశో నృప.**
**మధ్యే భువి సమాసీనా శ్చతుఃషష్టిమితాః కలాః।**
**నానాయుధధరా వీరా రత్నభూషణభూషితాః.**
**ప్రత్యేకలోకస్తాసాం తు తత్తల్లోకస్య నాయకాః।**
**సమంతాత్పద్మరాగస్య పరివార్య స్థితాః సదా.**
**స్వస్వలోకజనై ర్జుష్టాః స్వస్వవాహనహేతిభిః।**
**తాసాం నామాని వక్ష్యామి శృణు త్వం జనమేజయ.**
**పింగలాక్షీ విశాలాక్షీ సమృద్ధి ర్వృద్ధి రేవ చ।**
**శ్రద్ధా స్వాహాస్వధాభిఖ్యా మాయా సంజ్ఞా వసుంధరా.**
**త్రిలోకధాత్రి సావిత్రి గాయత్రీ త్రిదశేశ్వరీ।**
**సురూపా బహురూపా చ స్కందమాతాఽచ్యుతప్రియా.**
**విమలా చామలా తద్వ దరుణీ పునరారుణీ।**
**ప్రకృతి ర్వికృతిః సృష్టిః స్థితిః సంహృతి రేవ చ.**
**సంధ్యా మాతా సతీ హంసీ మర్దికా వజ్రికాపరా।**
**దేవమాతా భగవతీ దేవకీ కమలాసనా.**
**త్రిముఖీ సప్తముఖ్యాన్యా సురాసురవిమర్దినీ।**
**లంబోష్ఠీ చోర్ధ్వకేశీ చ బహుశీర్షా వృకోదరీ.**

రథరేఖాహ్వయా పశ్చాచ్ఛశిరేఖా తథాపరా।
గగనవేగా పవనవేగా చైవ తతః పరమ్.
అగ్రే భువనపాలా స్యా త్తత్పశ్చాన్మదనాతురా।
అనంగానంగమథనా తథైవానంగమేఖలా.
అనంగకుసుమా పశ్చా ద్విశ్వరూపా సురాదికా।
క్షయంకరీ భవేచ్ఛక్తి రక్షోభ్యా చ తతఃపరమ్.
సత్యవాది న్యథ ప్రోక్తా బహురూపా శుచివ్రతా।
ఉదారాఖ్యా చ వాగీశీ చతుఃషష్టిమితాః స్మృతాః.
జ్వలజ్జిహ్వాననాః సర్వా వమంతో వహ్నిముల్బణమ్।
జలంపిబామః సకలం సంహరామో విభావసుమ్.
పవనం స్తంభయామోఽద్య భక్షయామోఽఖిలం జగత్।
ఇతి వాచం సంగిరంతే క్రోధసంరక్తాలోచనాః.
చాపబాణధరాః సర్వా యుద్ధాయై వోత్సుకాః సదా।
దంష్ట్రాకటకటారావై ర్బధిరీకృతదిఙ్ముఖా॥
పింగోర్ధ్వకేశ్యః సంప్రోక్తా శ్చాపబాణకరాః సదా।
శతాక్షౌహిణికా సేనాప్యేకైకస్యాః ప్రకీర్తితా.
ఏకైకశక్తేః సామర్థ్యం లక్షబ్రహ్మాండనాశనే।
శతాక్షౌహిణికాసేనా తాదృశీ నృపసత్తమ.
కిం నకుర్యా జ్జగత్యస్మి న్న శక్యం వక్తుమేవ తత్।
సర్వాపి యుద్ధ సామగ్రీ తస్మిన్సాలే స్థితా మునే.
రథానాం గణనా నాస్తి హయానాం కరిణాం తథా।
శస్త్రాణాం గణనా తద్వ ద్గణానాం గణనా తథా.

వ్యాసుని వచనం-

పుష్యరాగ మణుల ప్రాకారానికి ఎగువగా లోపలివైపున కుంకుమవలె ఎఱ్ఱనైన పద్మరాగ మణుల ప్రాకారం శోభిస్తుంటుంది. అక్కడ నేల కూడా అలాగే ఎఱ్ఱగా ఉంటుంది. ఆ ప్రాకారం పది యోజనాల ఎత్తు గలది. దానికి గోపుర ద్వారములున్నాయి. రాజా! అచ్చట పద్మరాగమణులతో ప్రకాశించే మండపాలు ఎన్నో ఉన్నాయి. ఆ ప్రాకారాల నడుమ అనేక ఆయుధాలు, రత్నభూషణాలు దాల్చిన వీరులు, అరవై నాలుగు కళలు కలవు. ఆ వీరులకు ప్రత్యేక నాయకులు కూడా ఉన్నారు. వారికి ప్రత్యేక లోకాలున్నాయి.




ఆ లోకాలూ పద్మరాగమణులచే నిర్మింపబడ్డవే. ఆయా లోకములందలి జనులు ఆయా వాహనాలు, వస్త్రాలు ధరిస్తారు. జనమేజయా! వారి పేర్లు చెప్తున్నాను విను. పింగలాక్షి- విశాలాక్షి- సమృద్ధి- వృద్ధి- శ్రద్ధ- స్వాహా- స్వధా- అభిఖ్య- మాయ- సంజ్ఞ- వసుంధర- లోకధాత్రి- సావిత్రి- గాయత్రి- త్రిదశేశ్వరి- సురూప- బహురూప- స్కందమాత- అచ్యుతప్రియ- విమల- అమల- అరుణి- ఆరుణి- ప్రకృతి- వికృతి- సృష్టి- స్థితి- సంహృతి- సంధ్య- మాత- సతి- హంసి - మర్దిక- వజ్రిక- దేవమాత- భగవతి- దేవకి- కమలాసన- త్రిముఖి- సప్తముఖి- సురాసురవిమర్దిని- లంబోష్ఠి- ఊర్ధ్వకేశి- బహుశీర్ష- వృకోదరి- రథరేఖ- శశిరేఖ- గగనవేగ- పవనవేగ- భువనపాల- మదనాతుర- అనంగ- అనంగమథన- అనంగమేఖల- అనంగకుసుమ- విశ్వరూప- సురాధిక- క్షయంకరి- శక్తి- అక్షోభ్య- సత్యవాదిని- బహురూప- శుచివ్రత- ఉదార- వాగీశి అనే అరవైనాలుగు కళలు శక్తులనబడతాయి.

వారందరికీ నిప్పులు గక్కుతున్న మహోజ్జ్వల నాలుకలున్నాయి. వారి అనేక ముఖాల నుండి అగ్ని జ్వాలలు ప్రజ్జ్వరిల్లుతుంటాయి. "మనమీ నీరంతా త్రాగుదాం. ఈ అగ్నినంతా చల్లార్చుదాం. ఈ గాలినంతా స్తంభింపజేద్దాం.

ఈ జగాన్నెల్లా భక్షించి వేద్దాం" అని కన్నులెఱ్ఱజేసి వారు పలుకుతుంటారు. అందరూ విల్లమ్ములు దాల్చి కయ్యానికి కాలు దువ్వుతుంటారు. పటపట పండ్లుకొరుకుటచే కలిగే చప్పుళ్లకు దిక్కులకు చెవుడు పట్టినట్లుంటాయి. ఆ మహావీరులలో ప్రతిఒక్కనికి ఊర్ధ్వకేశాలు కలవు. వారికి విల్లమ్ములు దాల్చిన వందల అక్షౌహిణుల సేన ఉంది. ఒక్కొక్క శక్తికి లక్ష బ్రహ్మాండములనైనా చంపగల శక్తి ఉంది. అటువంటివి వందల అక్షౌహిణుల సేనలు ఉన్నాయి. ఈ లోకాలలో ఆ శక్తులకు సాధ్యంకానిది ఉందని ఎవ్వరూ అనజాలరు. ఆ ప్రాకారమందు వారి యుద్ధ సామగ్రి అంతా భద్రపరచబడి ఉంటుంది. అచట రథాలు, గుఱ్ఱాలు, శస్త్రాలు, గణాలు లెక్కకుమించి ఉన్నాయి.

## 11. గోమేధిక ప్రాకారం:

**పద్మరాగమయా దగ్రే గోమేదమణినిర్మితః।**
**దశయోజనదైర్ఘ్యేణ ప్రాకారో వర్తతే మహాన్॥**
**భాస్వజ్జపా ప్రసూనాభో మధ్యభూ స్తస్య తాదృశీ।**
**గోమేదకల్పితాన్యేవ తద్వాసిసదనానిచ॥**
**పక్షిణః స్తంభవర్యా శ్చ వృక్షా వాప్యః సరాం సి చ।**
**గోమేదకల్పితా ఏవ కుంకుమారుణ విగ్రహా॥**





తన్మధ్యస్థా మహాదేవ్యో ద్వాత్రింశచ్ఛక్తయః స్మృతాః।
నానాశస్త్ర ప్రహరణా గోమేదమణిభూషితాః॥
ప్రత్యేకలోకవాసిన్యః పరివార్య సమంతతః।
గోమేదసాలే సన్నద్ధాః పిశాచవదనా నృప॥
స్వర్లోకవాసిభి ర్నిత్యం పూజితాశ్చ కబాహవః।
క్రోధరక్తేక్షణా బింధి వచ చ్ఛింధి దహేతి చ॥
వదంతి సతతం వాదం యుద్ధోత్సుక హృదంతరాః।
ఏకైకస్యా మహాశక్తే ర్దశాక్షౌహిణికా మతా॥
సేనా తత్రా ప్యేకశక్తిర్లక్షబ్రహ్మాండనాశినీ।
తాదృశీనాం మహాసేనా వర్ణనీయా కథం నృప॥
రథానాం నైవ గణనా వాహనానాం తథైవ చ।
సర్వయుద్ధసమారంభస్తత్ర దేవ్యా విరాజతే॥
తాసాం నామాని వక్ష్యామి పాపనాశకరాణి చ।
విద్యాహ్రీ పుష్టయః ప్రజ్ఞాసినీవాలీ కుహూ స్తథా॥
రుద్రా వీర్యా ప్రభా నందా పోషిణీ ఋద్ధిదా శుభా।
కాళరాత్రి ర్మహారాత్రి ర్భద్రకాళీ కపర్దినీ॥
వికృతిర్దండి ముండిన్యౌ సేందుఖండా శిఖండినీ।
నిశుంభ శుంభమథినీ మహిషాసుర మర్దినీ॥
ఇంద్రాణీ చైవ రుద్రాణీ శంకరార్ధశరీరిణీ।
నారీ నారాయణీచైవ త్రిశూలిన్యపి పాలినీ॥
అంబికా హ్లాదినీ పశ్చా దిత్యేవం శక్తయః స్మృతా।
యద్యేతాః కుపితా దేవ్యస్తదా బ్రహ్మాండనాశనమ్॥
పరాజయో నచైతాసాం కదాచి త్క్వచిదస్తిహి॥

అటువంటి పద్మరాగమణుల ప్రాకారానికి ఎగువగా లోపలి వైపున గోమేదకమణుల ప్రాకారం అలరారుతుంటుంది. అది పదియోజనాల ఎత్తున విలసిల్లుతుంటుంది. అది జపాకుసుమాల వలె వెలుగులు విరజిమ్ముతుంటుంది. దాని మధ్య నేల కూడా అలాగే ఉంటుంది. అక్కడుండే వారు అదే వర్ణంతో ఉంటారు. అచటి భవనాలు అదే వర్ణంతో గోమేదక కాంతులు చిమ్ముతుంటాయి. అక్కడి పక్షులు, వృక్షాలు, స్తంభాలు, కొలంకులు కుంకుమవలె ఎఱ్ఱగా గోమేదకంలో చేయబడినట్లుంటాయి. ఆ ప్రాకార మధ్యంలో దేవి




యొక్క ముప్పైరెండు శక్తులుంటారు. వారు గోమేదకపు భూషణాలు దాల్చి అనేక శస్త్రాలు ప్రయోగించగలిగేలా ఉంటారు. ఆ ప్రాకారంలో ముప్పైరెండు లోకాలున్నాయి. ప్రతి లోకశక్తికి పది అక్షౌహిణుల సేన కలదు.

రాజా! గోమేదక ప్రాకారమందలి శక్తులు పిశాచవదనలు.

ఆ శక్తులు నిరంతరం చక్రములు దాల్చుతారు. స్వర్గలోక వాసులచేత నిత్యం పూజింపబడుతుంటారు. వారు కోపోద్రేకంతో "ఛేదించండి- భేదించండి- వండండి- కాల్చండి" అంటూ నిరంతరం యుద్ధం చేసే తలంపుతో ఉంటారు.

ప్రతిమహాశక్తి వద్ద పది అక్షౌహిణుల సేనలుంటాయి. వారిలో ప్రతిశక్తి లక్ష బ్రహ్మాండాలనైనా నాశనం చేయగలది. అటువంటి మహాసేనలని ఎంతని వర్ణించగలం?

అక్కడున్న రథాలకు, వాహనాలకు ఇంక లెక్కేలేదు. వారందరూ దేవి కొరకై యుద్ధం చేయడానికి సన్నద్ధంగా ఉంటారు.

పాపహరములైన వారి పేర్లు తెలిపెదను విను. విద్య హ్రీ పుష్టి ప్రజ్ఞ సినీవాలి కుహూ రుద్ర వీర్య ప్రభ నంద పోషిణి ఋద్ధిద శుభ కాలరాత్రి మహారాత్రి భద్రకాళి కపర్దిని వికృతి దండిని ముండిని సేందుఖండ శిఖండిని నిశుంభ శుంభమథిని మహిషా సురమర్దిని ఇంద్రాణి రుద్రాణి శంకరార్ధశరీరిణి నారి నారాయణి త్రిశూలిని పాలిని అంబిక హ్లాదిని మాయాదేవి. కోపిస్తే వీరు బ్రహ్మాండాలనెల్లా నశింపజేయగలరు.

వీరు ఎన్నడూ ఓటమి ఎరుగరు.

## 12. హీర (వజ్ర) ప్రాకారం:

**గోమేదకమయాదగ్రే సద్వజ్రమణి నిర్మితః**
**దశయోజనతుంగోఽసౌ గోపురద్వార సంయుతః।**
**కపాటశృంఖలాబద్ధో నవవృక్ష సముజ్జ్వలః॥**
**సాలస్తన్మధ్యభూమ్యాపి సర్వం హీరమయం స్మృతమ్।**
**గృహాణి వీథయో రథ్యా మహామార్గాంగణాని చ॥**
**వృక్షాలవాలతరవః సారంగా అపి తాదృశాః।**
**దీర్ఘికాశ్రేణయో వాప్యస్తడాగాః కూపసంయుతాః॥**
**తత్ర శ్రీ భువనేశ్వర్యా వసంతి పరిచారికాః।**
**ఏకైకా లక్షదాసీభిః సేవితా మదగర్వితాః॥**
**తాలవృంతధరాః కాశ్చి చ్చషకాఢ్య కరాంబుజాః।**
**కాశ్చిత్తాంబూలపాత్రాణి ధారయంత్యోఽతి గర్వితాః॥**




కాశ్చిత్తచ్ఛత్ర ధారిణ్య శ్చామరాణాం విధారికాః।
నానా వస్త్రధరాః కాశ్చిత్కాశ్చిత్పుష్ప కరాంబుజాః॥
నానాదర్శకరాః కాశ్చిత్కాశ్చి త్కుంకుమలేపనమ్।
ధారయంత్యః కజ్జలం చ సిందూర చషకం పరాః॥
కాశ్చిచ్చిత్రక నిర్మాత్ర్యః పాదసంవాహనే రతాః।
కాశ్చిత్తు భూషాకారిణ్యో నానా భూషాధరాః పరాః॥
పుష్పభూషణ నిర్మాత్ర్యః పుష్పశృంగార కారికాః।
నానావిలాస చతురా బహ్వ్య ఏవం విధాః పరాః॥
నిబద్ధపరిధానీయా యువత్యః సకలా అపి।
దేవీకృపా లేశవశా త్తుచ్ఛీ కృత జగత్త్రయాః॥
ఏతాదూత్యః స్మృతా దేవ్యః శృంగార మదగర్వితాః।
తాసాం నామాని వక్ష్యామి శృణు మే నృపసత్తమ॥
అనంగరూపా ప్రథమా ప్యనంగ మదనా పరా।
తృతీయా తు తతః ప్రోక్తా సుందరీ మదనాతురా॥
తతో భువనవేగా స్యా త్తథా భువనపాలికా।
స్యాత్సర్వశిశిరానంగ వేదనానంగ మేఖలా॥
విద్యుద్దామసమానాంగ్యః క్వణత్కాంచీగుణాన్వితాః।
రణన్మం జీరచరణా బహిరంతరిత స్తతః॥
ధావమానాస్తు శోభంతే సర్వా విద్యుల్లతోపమాః।
కుశలాః సర్వకార్యేషు వేత్రహస్తాః సమంతతః॥
అష్టదిక్షు తథైతాసాం ప్రాకారా ద్బహి రేవ చ।
సదనాని విరాజంతే నానావాహనహేతిభిః॥

అటువంటి గోమేదక ప్రాకారం దాటితే దానికి ఎగువగా లోపలివైపున వజ్రాల ప్రాకారం ప్రకాశిస్తుంటుంది. అది పది యోజనాల ఎత్తు కల్గి గోపుర ద్వారాలు కల్గి గొలుసులు బిగించిన తలుపులతో శోభలు వెలార్చుతూంటుంది. ఆ ప్రదేశం కొత్తకొత్త చెట్లతో అలరారు తుంటుంది. ఆ ప్రాకారమందలి నేలంతా వజ్రమయమే.

అక్కడి ఇల్లు, వీధులు, సందుగొందులు, పెద్దపెద్ద వీధులు, చెట్లు తీగలు, పక్షులు, బావులు, దిగుడు బావులు, చెరువులు కూడా వజ్రమయాలే. ఆ చోట శ్రీత్రిభువనేశ్వరీ దాసీజనం నివసిస్తారు. ప్రతి దాసి మరల లక్షలదాసీజనంచే గర్వంగా సేవలందుకుంటుంది. వారిలో




కొందరు తాటాకు విసనకర్రలు, కొందరు పానపాత్రలు, కొందరు తాంబూల పాత్రలు చేతపట్టుకొని ఉంటారు. కొందరు ఛత్రచామరాలు, నానా వస్త్రాలు, పుష్పాలు, నిలువుటద్దాలు, కుంకుమానులేపనాలు, కాటుక, సింధూరం, పానపాత్ర దాల్చి ఉంటారు. కొందరు చిత్రాలను దించడంలో, కొందరు అలంకారాలు చేయడంలో నిపుణులు. మరికొందరు దేవీపాదకమలాలు ఒత్తుటయందే తన్మయులవుతారు. కొందరు ఒంటినిండా అలంకారాలు దాల్చుతారు. కొందరు పూల అలంకా రాలు, రకరకాలైన పూలదండలు అల్లుతుంటారు.

ఈ విధంగా అక్కడి స్త్రీలు విలాసవతులై చతురలై రాణకెక్కుతారు.

ఆ యువతులంతా దేవీసేవకై నడుంబిగించి ఉంటారు. వారు దేవీదయాదృష్టిచే ముల్లోకాలను సైతం తుచ్ఛంగా తలంచుతారు. శ్రీదేవిదాసులు శృంగారమదగర్వితలు; ఆ దేవిదాసుల పేర్లు చెబుతున్నాను విను.

అనంగరూప అనంగమదన సుందరి మదనాతుర భువనవేగ భువనపాలిక సర్వశిశిర అనంగవేదన అనంగమేఖల. వారంతా మెరుపుతీగవంటి మేనులు కలవారు. మ్రోగే మొలినూలి గంటలతో, నినదించే కాలి అందెలతో అటూఇటూ ఒయ్యారం ఒలకబోస్తూ తిరుగుతుంటారు. అక్కడ కొందరు మెఱుగుబోడులు చేతిలో దండముతో అన్ని పనులను చక్కబెట్టుటలో నేర్పరులై, అటూఇటూ పరుగులిడుతూ కన్నుల పండువగా ఉంటారు.

ఆ ప్రాకారానికి బయట ఎనిమిది దిక్కులందు వారి వారి భువనాలు ఉన్నాయి. అందులో వారి అనేక వాహనాలు, ఆయుధాలు ఉంటాయి.

## 13. వైదూర్య ప్రాకారం:

**వజ్రసాలా దగ్రభాగే సాలో వైదూర్యనిర్మితః।**
**దశయోజనతుంగోఽసౌ గోపురద్వారభూషితః॥**
**వైదూర్యభూమిః సర్వాపి గృహాణి వివిధాని చ।**
**విథ్యోరథ్యా మహామార్గాః సర్వేవైదూర్య నిర్మితాః॥**
**వాపీకూపతడాగాశ్చ స్రవంతీనాం తటాని చ।**
**వాలుకా చైవ సర్వాఽపి వైదూర్యమణి నిర్మితా॥**
**తత్రాష్టదిక్షుపరితో బ్రాహ్మ్యాదీనాం చ మండలం।**
**నిజైర్గణైః పరివృతం భ్రాజతే నృపసత్తమ॥**
**ప్రతి బ్రహ్మాండ మాతౄణాం తాః సమష్టయ ఈరితాః।**
**బ్రాహ్మీమాహేశ్వరీ చైవకౌమారీ వైష్ణవీ తథా॥**




వారాహీ చ తథేంద్రాణీ చాముండా సప్తమాతరః।

అష్టమీ తు మహాలక్ష్మీ ర్నామ్నా ప్రోక్తాస్తు మాతరః॥

బ్రహ్మరుద్రాదిదేవానాం సమాకారాస్తు తాః స్మృతాః।

జగత్కల్యాణకారిణ్యః స్వస్వసేనా సమావృతాః॥

తత్సాలస్య చతుర్ద్వార్షు వాహనాని మహేశితుః।

సజ్జాని నృపతే సంతి సాలంకారాణి నిత్యశః॥

దంతినః కోటిశో వాహాః కోటిశః శిబికాస్తథా।

హంసాః సింహాశ్చ గరుడా మయూరా వృషభా స్తథా॥

తైర్యుక్తాః స్కందనాస్తద్వత్కోటిశో నృపనందన।

పార్ష్ణి గ్రాహసమాయుక్తా ధ్వజై రాకాశచుంబినః॥

కోటిశస్తు విమానాని నానా చిహ్నాన్వితాని చ।

నానావాదిత్రయుక్తాని మహాధ్వజయుతాని చ॥

ఆ వజ్రప్రాకారం దాటగానే దాని కెగువగా లోపలివైపున వైడూర్యమణుల ప్రాకారం ఉంది. అని పదియోజనాల ఎత్తుగా గోపుర ద్వారాలతో విలసిల్లుతుంటుంది. అచ్చటి నేల, ఇళ్ళు, వీధులు, సందులు గొందులు అన్ని వైడూర్యమయాలే. అక్కడి వాపీ కూపములు, చెరువులు, నదీతీరాలు, ఇసుకభూములు అన్ని వైడూర్యమయాలే. అక్కడి ఎనిమిది దిక్కులందు బ్రాహ్మీమొదలైన దేవతల మండలాలు ఉన్నాయి.

వారందరూ తమ తమ గణములతో కొలువుంటారు. ప్రతి బ్రహ్మాండమునందలి తల్లులంద రికీ వీరే సమష్టిగా ప్రతిరూపాలుగా పేర్కొనబడతారు. బ్రాహ్మీ, మాహేశ్వరీ, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండ అనే వాళ్ళు సప్తమాతృకలు. ఎనిమిదవ మాతృక శ్రీమహాలక్ష్మీ ప్రసిద్ధి గాంచినది. వీరు బ్రహ్మరుద్రాది దేవతలకు సమానమైన ఆకార చేష్టలు కలవారు. జగాలకు శుభకారిణులు. తమ తమ సేనలతో శోభిల్లుతుండేవారు. ఈ ప్రాకారం నాల్గుద్వారములందు నిత్యం మహేశ్వరి దేవి దివ్య వాహనాలు చక్కగా అలంకరించబడి సంసిద్ధంగా ఉంటాయి. అచట కోట్లకొలది ఏనుగులు, గుఱ్ఱములు, రాయంచలు, సింహాలు, గరుత్మం తులు, వృషభాలు, పల్లకీలు, నెమళ్ళు వాహనాలై సిద్ధంగా ఉంటాయి.

అలాగే కోట్లకొలదిగా రథాలు ఉన్నాయి. వాటికిరువైపులా పార్శ్వచరులు ఉన్నారు. రథాల టెక్కెములు ఆకాశాన్ని ముద్దాడుతున్నట్లుంటాయి. అక్కడ అనేక రకాల జెండాలతో గుర్తులతో వాద్యవిశేషాలతో అలరారే విమానాలు కోట్ల సంఖ్యలో ఉన్నాయి.



## 14. ఇంద్రనీల ప్రాకారం:

వైదూర్య మణిసాలస్యా వ్యగ్రేసాలః పరః స్మృతః।
దశయోజనతుంగోఽసా వింద్రనీలాశ్మనిర్మితః॥
తన్మధ్యభూ స్తథా వీథ్యో మహామార్గా గృహాణిచ।
వాపీకూపతడాగాశ్చ సర్వే తన్మణి నిర్మితాః॥
తత్ర పద్మం తు సంప్రోక్తం బహుయోజన విస్తృతమ్।
షోడశారం దీప్యమానం సుదర్శనమివాపరమ్॥
తత్ర షోడశశక్తీనాం స్థానాని వివిధాని చ।
సర్వోపస్కర యుక్తాని సమృద్ధాని వసంతి హి॥
తాసాం నామాని వక్ష్యామి శృణు మే నృపసత్తమ।
కరాళీ వికారాళీ చ తథోమా చ సరస్వతీ॥
శ్రీదుర్గోషా తథా లక్ష్మీః శుతిశ్చైవ స్మృతిర్ధృతిః।
శ్రద్ధా మేధా మతిః కాంతిరార్యా షోడశశక్తయః॥
నీలజీమూత సంకాశాః కరవాలకరాంబుజాః।
సమాఖేటక ధారిణ్యో యుద్ధోప క్రాంతమానసాః॥
సేనాన్యః సకలా ఏతాః శ్రీదేవ్యా జగదీశితుః।
ప్రతి బ్రహ్మాండ సంస్థానాం శక్తీనాం నాయికాః స్మృతాః॥
బ్రహ్మాండక్షోభకారిణ్యో దేవీశక్త్యుపబృంహితాః।
నానారథసమారూఢా నానాశక్తిభిరన్వితాః॥
ఏతత్పరా క్రమం వక్తుం సహస్రాస్యోఽపి న క్షమః।

అటువంటి వైదూర్య ప్రాకారానికి ఎగువగా లోపలి వైపున పదియోజనాల ఎత్తున ఇంద్ర నీలమణుల ప్రాకారం ప్రకాశిస్తుంటుంది. అందలి బావులు, కొలంకులు, ఇళ్ళు, మహా మార్గములు, గొందులు అన్ని ఇంద్రనీలమయములే.

అక్కడ అనేక యోజనాలు వెడల్పుతో ఒక మహాపద్మం అలరారుతుంటుంది. అది పదహారు రేకులు కలిగి సుదర్శన చక్రంవలె ప్రకాశిస్తుంటుంది.

అచట పదహారు శక్తుల నివాసస్థానాలు కలవు. వారు తమ తమ వస్తుసామగ్రులతో నివాసముంటారు. రాజా! వారి పేర్లు చెప్తున్నాను విను.

కరాళి, వికారాళి, ఉమ, సరస్వతి, శ్రీ, దుర్గ, ఉష, లక్ష్మి, శ్రుతి, స్మృతి, ధృతి, శ్రద్ధా, మేధ, మతి, కాంతి, ఆర్య అనే పదహారు మంది మహాశక్తులు. వారు నీలమేఘము వంటి




కాంతి కలిగి చేతులందు కత్తులు, సమము, ఆఖేటకము మొదలైన ఆయుధాలు దాల్చి యుద్ధ సన్నద్ధులై ఉంటారు. వారందరూ జగదీశ్వరీదేవి యొక్క సేనానాయికలు.

ప్రతి బ్రహ్మాండమందలి శక్తులకన్నిటికీ మహానాయికలుగా పేరుగాంచారు. వారు బ్రహ్మాండాలనే తలక్రిందులుగా జేసే శక్తి కలవారు. దేవీశక్తి సంపన్నులు. నానా రథాలెక్కి పలుశక్తులను ధరించేవారు. ఆదిశేషుడు కూడా వారి పరాక్రమం తెలుపజాలడు.

## 15. ముక్తారత్న ప్రాకారం:

**ఇంద్రనీలమహాసాలా దగ్రే తు బహు విస్తృతః॥**
**ముక్తా ప్రాకార ఉదితో దశయోజన దైర్ఘ్యవాన్।**
**మధ్యభూః పూర్వ వత్ప్రోక్తా తన్మధ్యేఽష్ట దళాంబుజమ్॥**
**ముక్తామణిగణాకీర్ణం విస్తృతం తు సకేసరమ్।**
**తత్ర దేవీసమాకారా దేవ్యాయుధధరాః సదా॥**
**సంప్రోక్తా అష్టమంత్రిణ్యో జగద్వార్తా ప్రబోధికాః।**
**దేవీ సమానభోగాస్తా ఇంగితజ్ఞా స్తు పండితాః॥**
**కుశలాః సర్వకార్యేషు స్వామికార్యపరాయణాః।**
**దేవ్యభిప్రాయ బోధ్యస్తా శ్చతురా అతిసుందరాః॥**
**నానాశక్తి సమాయుక్తాః ప్రతి బ్రహ్మాండవర్తినామ్।**
**ప్రాణినాం తాః సమాచారం జ్ఞానశక్త్యా విదంతి చ।**
**తాసాం నామాని వక్ష్యామి మత్తః శృణునృపోత్తమ।**
**అనంగకుసుమా ప్రోక్తా ప్యవంగకుసుమాతురా॥**
**అనంగమదనా తద్వదనంగమదనాతురా।**
**భువనపాలా తు సా గగనవేగా చైవ తతః పరమ్॥**
**శశిరేఖా చ గగనరేఖా చైవ తతః పరమ్।**
**పాశాంకుశవరాభీతి ధరా అరుణవిగ్రహాః॥**
**విశ్వసంబంధినీం వార్తాం బోధయంతి ప్రతిక్షణమ్॥**

ఇంద్రనీల ప్రాకారానికి ఎగువగా లోపలివైపున విస్తారముగల ఇంకొక ప్రాకారం ఉంది. అది ముత్యాల ప్రాకారం. పది యోజనాల ఎత్తున తళతళలాడుతూ ఉంటుంది. అందలి నేల అంతా జాతిముత్యాల కాంతులను విరజిమ్ముతుంటుంది. మధ్యలో ఎనిమిది దళాల కమలం వెలుగులీనుతుంటుంది. అది ముత్యాల మణుల కాంతులీనుతుంటుంది. ఆ కమలం




లో లెక్కకు మించి కేసరాలుంటాయి. అచట దేవితో సమానమైన ఆకార మును దేవి ఆయుధాలు దాల్చినవారు ఉన్నారు. వారు అష్టమంత్రిణులు. దేవితో సమానమైన సుఖ భోగాలను అనుభవిస్తుంటారు. ఇంగితమెరిగినవారు. పండితురాళ్ళు. ఎల్లలోకాల వార్తలను తెలుపగలవారు. అన్ని కార్యాలలో వారు చతురలు. స్వామికార్య పరాయణలు. అతిలోక సుందరులు. దేవి మనస్సును బాగా అర్థం చేసికొనే వారు. వారు ప్రతి బ్రహ్మాండమందలి అనేక శక్తులతో కూడి ఉంటారు. తమ త్రికాలజ్ఞానంతో ప్రాణుల సమాచారాలు రహస్యాలు తెలియగలవారు. రాజా! వారి పేర్లు చెబుతాను విను. అనంగకుసుమ, అనంగకుసుమాతుర, అనంగమదన, అనంగమదనాతుర, భువనపాల, గగనవేగ, శశిరేఖ, గగనరేఖ. వీరంతా పాశాంకుశాలు, వరాభయముద్రలు దాల్చిన ఎఱ్ఱని విగ్రహాల వారు. వారు ఈ విశ్వమంతటా జరిగే వార్తలనన్నిటిని క్షణక్షణం తెలుపగలవారు.

## 16. మరకత ప్రాకారం:

**ముక్తాసాలా దగ్రభాగే మహామారకతోపరః।**
**సాలోత్తమః సముద్దిష్టో దశయోజన దైర్ఘ్యవాన్।**
**నానాసౌభాగ్య సంయుక్తో నానాభోగ సమన్వితః॥**
**మధ్యభూస్తా దృశీ ప్రోక్తా సదనాని తథైవచ।**
**షట్కోణ మత్ర విస్తీర్ణం కోణస్థా దేవతాః శృణు॥**
**పూర్వకోణే చతుర్వక్త్రో గాయత్రీ సహితో విధిః।**
**కుండికాక్ష గుణాభీతి దండాయుధ ధరః పరః॥**
**తదాయుధ ధరా దేవీ గాయత్రీ పరదేవతా।**
**వేదాః సర్వే మూర్తిమంతః శాస్త్రాణివివిధాని చ॥**
**స్మృతయశ్చ పురాణాని మూర్తి మంతి వసంతి హి।**
**యే బ్రహ్మవిగ్రహాః సంతి గాయత్రీ విగ్రహాశ్చ యే॥**
**వ్యాహృతీనాం విగ్రహాశ్చ తేనిత్యం తత్ర సంతి హి।**
**రక్షః కోణేశంఖచక్ర గదాంబుజ కరాంబుజాః॥**
**సావిత్రీ వర్తతేతత్ర మహావిష్ణుశ్చ తాదృశః।**
**యే విష్ణు విగ్రహాః సంతి మత్స్యకూర్మాదయోఽఖిలాః॥**
**సావిత్రీ విగ్రహాయే చతే సర్వేతత్ర వసంతి హి।**
**వాయుకోణే పరశ్వక్షమాలాభయవరాన్వితః॥**




మహారుద్రో వర్తతేఽత్ర సరస్వత్యపి తాదృశీ।
యే యేతు రుద్రభేదాః స్యు ర్దక్షిణా స్యాదయోనృప॥
గౌరీభేదాశ్చ యే సర్వే తే తత్ర నివసంతి హి।
చతుః షష్ట్యాగమా యే చ యేచాన్యేఽప్యాగమాః స్మృతాః॥
తే సర్వే మూర్తిమంతశ్చ తత్రవై నివసంతిహి।
అగ్నికోణే రత్నకుంభం తథా మణికరండకమ్॥
దధానో నిజహస్తాభ్యాం కుబేరో ధననాయకః।
నానావీథీసమాయుక్తో మహాలక్ష్మీ సమన్వితః
దేవ్యానిధిపతిస్త్వాస్తే స్వగుణైః పరివేష్టితః।
వారుణేతు మహాకోణే మదనో రతి సంయుతః॥
పాశాంకుశధనుర్బాణధరో నిత్యం విరాజతే।
శృంగారమూర్తిమంతస్తు తత్ర సన్నిహితాః సదా॥
ఈశానకోణే విఘ్నేశో నిత్యం పుష్టిసమన్వితః।
పాశాంకుశధరో వీరో విఘ్నహర్తా విరాజతే॥
విభూతయో గణేశస్య యా యాః సంతి నృపోత్తమ।
తాః సర్వా నివసంత్యత్ర మహైశ్వర్య సమన్వితాః॥
ప్రతి బ్రహ్మాండ స్వస్థానాం బ్రహ్మాదీనాం సమష్టయః।
ఏతేబ్రహ్మాదయః ప్రోక్తాః సేవంతే జగదీశ్వరమ్॥

ముక్త ప్రాకారానికి ఎగువన లోపలివైపునా మరకత ప్రాకారం ఒప్పియున్నది. అది పదియోజనాల ఎత్తు కలది. భోగభాగ్యాలకి ఉనికిపట్టు. అందలి వేల భవనాలు మరకత మణులతో నిర్మించబడి కాంతులు విరజిమ్ముతుంటాయి.

అచట షట్కోణములు కలవు. ఆ కోణములందున్న దేవతల పేర్లు విను. తూర్పు కోణమందు శ్రీగాయత్రితో కూడిన బ్రహ్మ కమండలువు, అక్షమాల, దండం, అభయం, ఆయుధాలు దాల్చి విరాజిల్లుతుంటాడు. అవే ఆయుధాలు దాల్చి పరదేవతయైన గాయత్రి ప్రకాశిస్తుం టుంది. ఎల్ల వేదాలు, వివిధ శాస్త్రాలు, స్మృతులు, పురాణాలు మూర్తిమంతములై అచట నివసిస్తాయి.

బ్రహ్మ స్వరూపలు గాయత్రి స్వరూపలు వ్యాహృతుల రూపాలు అచట నివసిస్తుంటాయి. నైరృతకోణమునందు శంఖచక్రాలు గదాపద్మాలు చేతియందు దాల్చి సావిత్రీ విష్ణులు నివాసమైయుంటారు. మత్స్యం, కూర్మం మొదలైన విష్ణుని విగ్రహాలు సావిత్రీ స్వరూపాలు

అన్నీ అచట వెలసియుంటాయి. వాయుకోణమున పరశువు, అక్షమాల, అభయవరములు దాల్చి మహారుద్రుడు ప్రకాశిస్తుంటాడు. దక్షిణామూర్తి మొదలైన రుద్రుని విగ్రహాలు శ్రీగౌరీ స్వరూపాలు అచట విలసిల్లుతుంటారు. అక్కడ అరవైనాలుగు ఆగమాలు, తక్కిన ఆగమాలు రూపుదాల్చి అలరారుతుంటాయి. అగ్నికోణమందు తన చేతులతో రత్నకుంభం, మణికరండం దాల్చి ధనపతియైన కుబేరుడు వెలుగొందుతుంటాడు. అతడు చాలా వీధులలో మహాలక్ష్మిని కూడియుంటాడు. ధనపతి అచట తన దేవితో తన గణాలతో కూడి వసిస్తుంటాడు.

పడమటి కోణమున కామదేవుడు రతితో కూడి చెలువుమీరుతుంటాడు. అతడు పాశాంకుశాలు, చెఱకువిల్లు అమ్ములు దాల్చి శృంగారాది రసములు మూర్తిమంతములై కొలువ సొబగు మిగిలి ఉంటాడు. ఈశాన్యకోణంలో పుష్టితో పాశాంకుశాలు దాల్చి విఘ్నహరుడైన విఘ్నేశుడు నిత్యం వీరవేషమున తనరారుతుంటాడు.

గణపతి విభూతులెన్ని ఉన్నాయో అన్నీ అచట గొప్ప సంపదలతో తులతూగు తుంటాయి. అక్కడ ప్రతి బ్రహ్మాండమందలి బ్రహ్మాదుల సమష్టి రూపులైన బ్రహ్మాదులందరూ శ్రీజగదీశ్వరిని నిత్యం సేవిస్తుంటారు.

## 17. విద్రుమ ప్రాకారం:

**మహామారకతస్యాగ్రే శతయోజన దైర్ఘ్యవాన్।**
**ప్రవాళశాలోఽ_స్యపరః కుంకుమారుణ విగ్రహః॥**
**మధ్యభూస్తాదృశీ ప్రోక్తా సదనాని చ పూర్వవత్।**
**తన్మధ్యే పంచభూతానాం స్వామిన్యః పంచ సంతి చ॥**
**హృల్లేఖా గగనా రక్తా చతుర్థీ తు కరాళికా।**
**మహోచ్ఛుష్మా పంచమీ చ పంచభూత సమప్రభాః॥**
**పాశాంకుశ వరాభీతి ధారిణ్యోఽ_మిత భూషణాః।**
**దేవీసమాన వేషాఢ్యా నవయౌవన గర్వితాః॥**

మరకత ప్రాకారానికి ఎగువగా లోపలి వైపున పది యోజనాల ఎత్తున కుంకుమవలె ఎఱ్ఱనైన పగడాల ప్రాకారం మెరుస్తుంటుంది. దాని నడుమనున్న భవనాలన్నీ పగడాల వలె ఎఱ్ఱగా మిరుమిట్లు గొలుపుతుంటాయి. దాని నడుమ పంచభూతాల స్వామినులు ఐదుగురు ఉన్నారు. హృల్లేఖ, గగన, రక్త, కరాళిక, మహోచ్ఛుష్మ అనే వాళ్ళు పంచ భూతముల వంటి కాంతిగలవారు. వరాభయ పాశాంకుశాలు ధరించి అనేక అలంకారాలు దాల్చి, దేవి వలె వేషభూషలు గల్గి నవయౌవనంతో గర్విస్తుంటారు.




## 18. నానారత్న ప్రాకారం(మాణిక్యమండపం):

**ప్రవాళశాలా దగ్రేతు నవరత్న వినిర్మితః।**
**బహుయోజన విస్తీర్ణో మహాశాలోఽస్తి భూమిప॥**
**తత్రచామ్నాయదేవీనాం సదనాని బహూన్యపి।**
**నవరత్న మయాన్యేవ తడాగా శ్చ సరాంసి చ॥**
**శ్రీదేవ్యా యేఽవతారాః స్యు స్తే తత్ర నివసంతి హి।**
**మహావిద్యా మహాభేదాః సంతి తత్రైవ భూమిప॥**
**నిజావరణ దేవీభి ర్నిజభూషణ వాహనైః।**
**సర్వదేవ్యో విరాజంతే కోటిసూర్య సమప్రభాః॥**
**సప్తకోటి మహామంత్రదేవతాః సంతి తత్రహి।**
**నవరత్నమయా దగ్రే చింతామణిగృహం మహత్॥**
**తత్రత్యం వస్తుమాత్రం తు చింతామణి వినిర్మితమ్।**
**సూర్యోద్గారోపలై స్తద్వచ్చంద్రోద్గారోపలై స్తథా॥**
**విద్యుత్ప్రభోపలైః స్తంభాః కల్పితా స్తు సహస్రశః।**
**యేషాం ప్రభాభి రంతఃస్థం వస్తు కించిన్న దృశ్యతే॥**
**ఇతి శ్రీదేవీ భాగవతే మహాపురాణే ద్వాదశస్కంధే ఏకాదశోఽధ్యాయః॥**

పగడాల ప్రాకారానికి ముందు అనేక యోజనాల వైశాల్యం గల నవరత్న ప్రాకారం కలదు. అందులో ఆమ్నాయ దేవతలు భవనాలు చాలా ఉన్నాయి. (పూర్వ- దక్షిణ- పశ్చిమోత్తరోర్ధ్వామ్నాయములు) అచట చెఱువులు, కొలంకులు నవరత్నమయాలే. అచట శ్రీదేవి మహావతారాలు ప్రకాశిస్తుంటాయి. పాశాంకుశేశ్వరి, భువనేశ్వరి, భైరవి, కపాల భువనేశ్వరి, అంకుశభువనేశ్వరి, ప్రసాద భువనేశ్వరి, క్రోధ భువనేశ్వరి, త్రిపుట, అశ్వారూఢా, నిత్యక్లిన్న, అన్నపూర్ణ, త్వరిత. రాజా! కాళి, తార, షోడశి, భైరవి, మాతంగి మొదలైన దశమహావిద్యలు అక్కడ రూపుదాల్చి ప్రకాశిస్తుంటాయి.

అక్కడ సకల దేవీ రూపాలు తమ తమ ఆవరణ దేవతలతో అలంకారాలు దాల్చి కోటి సూర్యకాంతులలో విరాజిల్లుతుంటారు. అక్కడే ఏడుకోట్ల మహామంత్రములు రూపుదాల్చి శోభిల్లుతుంటాయి. నవరత్న ప్రాకారానికి ముందు శ్రీకరమైన చింతామణి గృహం మహోజ్జ్వలంగా ప్రభలు విరజిమ్ముతుంటుంది. అందలి ప్రతి వస్తువు చింతామణులచే నిర్మించబడినదే.

సూర్య కాంత- చంద్రకాంత శిలలతో మెరుగు కాంతుల మణులలో నిర్మించబడిన




వేల మణిస్తంభాలు అచట వెలుగు స్తంభాలవలె ఒప్పుతుంటాయి. అన్ని వెల్గుల నడుమ వస్తువేదీ కనిపించదు.

ఇది శ్రీదేవీ భాగవత మహాపురాణ మందలి పన్నెండో స్కంధంలో పదకొండో అధ్యాయం.

**అథ ద్వాదశోఽధ్యాయః**

## 19. సహస్రస్తంభ మండపం:

**వ్యాస ఉవాచ:**

**తదేవ దేవీసదనం మధ్యభాగే విరాజతే।**
**సహస్ర స్తంభసంయుక్తా శ్చత్వారస్తేషు మండపాః.**
**శృంగారమండపశ్చైకో ముక్తిమండప ఏవచ।**
**జ్ఞానమండపసంజ్ఞ స్తు తృతీయః పరికీర్తితః.**
**ఏకాంతమండపశ్చైవ చతుర్థః పరికీర్తితః।**
**నానావితాన సంయుక్తా నానాధూపై స్తు ధూపితాః.**
**కోటి సూర్య సమాః కాంత్యా భ్రాజంతే మండపాః శుభాః।**
**తన్మండపానాం పరితః కాశ్మీరవనికా స్మృతా.**
**మల్లికాకుందవనికా యత్ర పుష్పలతాః స్థితాః।**
**అసంఖ్యాతా మృగమదైః పూరితాస్తత్స్రవా నృప.**
**మహాపద్మాటవీ తద్వ ద్రత్నసోపాన నిర్మితా।**
**సుధారసేన సంపూర్ణా గుంజన్మత్త మధువ్రతా.**
**హంస కారండవాకీర్ణా గంధపూరిత దిక్తటా।**
**వనికానాం సుగంధైస్తు మణిద్వీపం సువాసితమ్.**
**శృంగారమండపే దేవ్యో గాయంతి వివిధైః స్వరైః।**
**సభాసదో దేవవరా మధ్యే శ్రీజగదంబికా.**
**ముక్తి మండప మధ్యేతు మోచయత్యనిశం శివా।**
**జ్ఞానోపదేశం కురుతే తృతీయే నృప మండపే.**
**చతుర్థే మండపే చైవ జగద్రక్షా విచింతనమ్।**
**మంత్రిణీ సహితా నిత్యం కరోతి జగదంబికా.**
**చింతామణిగృహే రాజన్ శక్తితత్వాత్మకైః పరైః।**
**సోపానైర్దశభిర్యుక్తో మంచకోఽప్యధిరాజతే.**




బ్రహ్మా విష్ణుశ్చ రుద్రశ్చ ఈశ్వరశ్చ సదాశివః।
ఏతే పంచ ఖురాః ప్రోక్తాః ఫలకస్తు సదాశివః.
తస్యోపరి మహాదేవో భువనేశో విరాజతే।
యా దేవీ నిజలీలార్థం ద్విధాభూతా బభూవహ.
సృష్ట్యాదౌతు స ఏవాయం తదర్ధాంగో మహేశ్వరః।
కందర్పదర్పనాశోద్యత్కోటికందర్పసుందరః.
పంచవక్త్ర స్త్రినేత్రశ్చ మణిభూషణ భూషితః।
హరిణాఽభీతి పరశూన్వరం చ నిజబాహుభిః.
దధానః షోడశాబ్దోఽసౌ దేవః సర్వేశ్వరో మహాన్।
కోటిసూర్య ప్రతీకాశ శ్చంద్రకోటి సుశీతలః.

## పన్నెండవ అధ్యాయం

## మణిద్వీపవర్ణనం - ఫలశ్రుతి

చింతామణుల మధ్యభాగంలో శ్రీదేవి దివ్యమందిరం విరాజిల్లుతున్నది. ఆ దివ్య మందిరానికి వేయి మణిస్తంభాలు, నాలుగు మండపాలు శోభలను గూరుస్తున్నాయి. అందులో ఒకటి శృంగారమండపం, రెండవది ముక్తి మండపం, మూడవది జ్ఞానమండపం, నాలుగవది ఏకాంత మండపం- అని ప్రసిద్ధి గాంచాయి. వీటిలో ఎన్నో మణుల అరుగులున్నాయి. అవి ధూపాల సువాసనలతో నిత్యం పరిమళాలు వెదజల్లుతుంటాయి. ఈ నాలుగింటిలో ప్రతి మంటపంలోను కోటి సూర్యకాంతులు విరజిమ్ముతుంటాయి.

ఆ మంటపానికి నలువైపులా కాశ్మీర వనాలు కనులకు ఇంపుగా ఉంటాయి. అచ్చట మంచిమల్లె పూదోటలు, కుందపు పూలతోటలు ఎన్నో పరిమళాలు గుబాళిస్తుంటాయి. ఆ తోటల్లో ఎన్నో మృగాలు మదము స్రవింపచేస్తూ తిరుగుతుంటాయి. అచట రతనాల మెట్ల వరుసలతో విరాజిల్లే మహాపద్మాల వనాలున్నాయి. ఆ పద్మాల్లో అమృతంవలె తేనెలు జాలువారుతుంటాయి. తుమ్మెదలు ఝుం ఝుం రోదలతో కమ్మని తేనెలానుతుంటాయి. అక్కడ హంసకారండవ పక్షులు ఉన్నాయి.

ఆ దివ్యవనంలో సుగుంధాలు దిక్కులెల్లా సువాసనలు వెదజల్లుతుంటాయి. ఆ పరిమళాల కెరటాలచే మణిద్వీపం సువాసితయై ఒప్పుతుంది. శృంగార మంటపంలో దేవతలు మధుర సుందర స్వరాలతో దివ్యగానం ఆలపిస్తారు. అక్కడ దేవతలంతా సభాసదులై యుంటారు. శ్రీజగదంబాదేవి వారి మధ్య దివ్య సింహాసనంపై విరాజిల్లుతుంటుంది. ముక్తి మంటప మందుండి జగదంబ బ్రహ్మాండమండలి పరమభక్తులకు ముక్తి భాగ్యం ప్రసాదిస్తుంటుంది.

జ్ఞాన మంటపమందు జ్ఞానకాంతులు వెలిగిస్తూ విధేయాత్ములైనవారికి పరమజ్ఞానాన్ని ఉపదేశిస్తుంటుంది. నాలుగో మంటపమందు దేవి తన మంత్రిణులతో కొలువుండి లోకరక్షణ గూర్చి ఆలోచిస్తుంటుంది.

చింతామణి గృహమందు శక్తి తత్వాత్మకాలైన పదిమెట్ల వరుసతో దివ్యకాంతులీనే మంచం శోభిల్లుతుంటుంది. దానిపై త్రిభువనేశ్వరుడు, మహాదేవుడు అయిన కామేశ్వరుడు ఉంటాడు. శ్రీత్రిభువనేశ్వరి దేవియే తన లీలా విలాసానికి రెండు రూపాలను దాల్చుతుంది. ఈ సృష్టికి మొట్టమొదట మహాదేవుడు త్రిభువనేశ్వరికి  అర్ధాంగుడయ్యాడు.

అతడు మన్మథుని దర్పమణచటానికి  పూనిన కోటి మదన సుందరుడు. అతనికి ఐదు ముఖాలు, మూడు నేత్రాలు కలవు. మణిభూషణాలతో అలంకరింపబడి అతడు తన హిరణ్య బాహులతో జింక, పరశువు, వరాభయ ముద్రలు దాల్చి విరాజిల్లుతుంటాడు. ఆ మహాదేవుడు- సర్వేశ్వరుడు- పదహారేళ్ళ యువకుడు, కోటి సూర్యుల వెలుగు, కోటి చంద్రుల చల్లదనం గల దేవుడు. అతడు శుద్ధ స్ఫటికంవలె వెలిగేవాడు; ముక్కంటి; చల్లని దయతోడి చూపులు విరజిమ్మేవాడు.

**శుద్ధ స్పటిక సంకాశ స్త్రినేత్రః శీతలద్యుతిః।**
**వామాంకే సన్నిషణ్ణాఽస్య దేవీ శ్రీభువనేశ్వరీ.**
**నవరత్న గణాకీర్ణ కాంచీదామ విరాజితా।**
**తప్త కాంచన సన్నద్ధ వైడూర్యాంగద భూషణా.**
**కనచ్ఛ్రీచక్రతాటంక విటంక వదనాంబుజా।**
**లలాట కాంతి విభవ విజితార్ధ సుధాకరా.**
**బింబకాంతి తిరస్కారి రదచ్ఛద విరాజితా।**
**లసత్కుంకుమకస్తూరీ తిలకోద్భాసితాననా.**
**దివ్యచూడామణిస్ఫార చంచ చ్చంద్రక సూర్యకా।**
**ఉద్యత్కాంతి సమస్వచ్ఛ నాసాభరణ భాసురా.**
**చింతాకాలంబిత స్వచ్ఛ ముక్తాగుచ్ఛ విరాజితా।**
**పాటీర పంకకర్పూర కుంకుమాలంకృత స్తనీ.**
**విచిత్రవివిధాకల్పా కంబుసంకాశకంధరా।**
**దాడిమీఫలబీజాభ దంతపంక్తి విరాజితా.**
**అనర్ఘ్య రత్నఘటిత ముకుటాంచితమస్తకా।**
**మత్తాలి మాలావిలస దలకాఢ్య ముఖాంబుజా.**




**కలంక కార్శ్య నిర్ముక్త శరచ్చంద్ర నిభాననా।**

**జాహ్నవీసలిలావర్త శోభినాభీ విభూషితా.**

**మాణిక్య శకలాబద్ధ ముద్రికాంగులి భూషితా।**

**పుండరీకదళా కారనయన త్రయ సుందరీ.**

**కల్పితా చ్ఛ మహారాగ పద్మరాగోజ్జ్వల ప్రభా।**

**రత్నకింకిణికాయుక్త రత్నకంకణ శోభితా.**

**మణిముక్తా సరాపార లసత్పదకసంతతిః।**

**రత్నాంగుళి ప్రవితత ప్రభాజాల లసత్కరా.**

**కంచుకీ గుంఫితాపార నానారత్న తతిద్యుతిః।**

**మల్లికామోద ధమ్మిల్ల మల్లికావిసరావృతా.**

**సువృత్తనిబిడోత్తుంగకుచభారాలసా శివా।**

**వరపాశాంకుశాభీతిలసద్బాహుచతుష్టయా.**

**సర్వ శృంగార వేషాఢ్యా సుకుమారాంగ వల్లరీ।**

**సౌందర్య ధారాసర్వస్వా నిర్వ్యాజ కరుణామయీ.**

**నిజసంలాపమాధుర్య వినిర్భర్సిత కచ్ఛపీ।**

**కోటికోటి రవీందూనాం కాంతిం యా బిభ్రతీ పరా.**

**నానాసఖీభి ర్దాసీభి స్తథా దేవాంగనాదిభిః।**

**సర్వాభి ర్దేవతాభిస్తు సమంతా త్పరివేష్టితా.**

**ఇచ్ఛాశక్త్యా జ్ఞానశక్త్యా క్రియాశక్త్యా సమన్వితా।**

అటువంటి త్రిభువనేశ్వరునకు ఎడమవైపున శ్రీత్రిభువనేశ్వరీదేవి నవరత్నాలు పొదగబడిన మొలనూలితో, క్రాగిన మేలిమి బంగారానికి వైడూర్యాలు పొదిగిన చేతి కడియాలతో ప్రకా శిస్తుంటుంది. మేలిమి బంగారంతో చేయబడిన శ్రీచక్రాకారంగల తాటంకాల కాంతులతో సొబగు మీరే ముఖకమలంతో దేవి ప్రకాశిస్తుంటుంది. ఆమె ముఖకాంతి వైభవం ముందు చంద్రుని కాంతులు వెలవెలబోతాయి.

బాగా పండిన దొండపండు కంటే ఎర్రని అధరంతో, నెన్నొసట కుంకుమ, కస్తూరి, తిలకముల సౌభాగ్యంతో దివ్యకాంతులీనే ముఖకమలంతో దేవి శోభిల్లుతుంటుంది. దేవి సూర్యచంద్రకాంతులను మించే దివ్యచూడామణి శిరోభూషణం గా గలది; ఉదయిస్తున్న శుక్రునివలె స్వచ్ఛకాంతులు విరజిమ్మే నాసాభరణంచే భాసిల్లుతున్నది; మంచి జాతిముత్యాల గుత్తులతో శోభిల్లుతున్న చింతాకుపతకము వ్రేలాడే మెడతో దేవి శోభిల్లుతున్నది.




మంచిగంధం, కర్పూరం, కుంకుమ అలదిన చనుదోయి గలది. చిత్రవిచిత్ర ములైన అనేక అలంకారాలను సింగారించుకొన్నది. శంఖం వంటి మెడ గలది. ఎఱ్ఱగా పండిన దానిమ్మ పండ్ల గింజలవంటి పలువరుసలు గలది. వెలలేని రత్నములచే పొదుగబడిన బంగారు కిరీటంతో శోభిల్లే శిరస్సు కలది. మత్తిల్లిన గండు తుమ్మెదలు మూగినట్లుండే ముంగురులతో అలరే ముఖకమలం కలది. కళంకం, క్షీణత్వం లేనిదై దివ్యశోభలు చిందులాడే శరత్పూర్ణిమ చంద్రుని వంటి ముఖం గలది. గంగానది సుడిగుండం వలె భాసిల్లే నాభి గలది.

మాణిక్యాలు పొదిగిన బంగారు ఉంగ రాలతో శోభిల్లే చేతివ్రేళ్ళు గలది. కమలదళాలవలె కాంతులు విరజిమ్మే మూడు నేత్రాలతో ఒప్పారేది. మెఱుగెక్కిన మహారాగ పద్మరాగ మణులను పోలిన నిర్మలమైన మహోజ్జ్వలమైన సర్వకళలు విరజిమ్మే సహజ లావణ్య శోభ గలది. రవళించే రతనాల కింకిణులు– కంక ణాలు గలది. మెడలో మణుల ముత్యాలహారములందు తళతళమనే బంగారు పతకం గలది.

ధగధగమనే రత్నపుటుంగరాల కాంతులు చిమ్మే చేతులు గలది. రవికపై పొదగబడిన అనేకవిధాల రతనాల కాంతులు వెలుగుతున్నాయి. వాడని మంచిమల్లెల పరిమళాలు వెదజల్లే కొప్పునందు ముడిచిన వ్రేలాడే మల్లెదండల చుట్టూ మూగే తుమ్మెదల వరుస గలది. శ్రీదేవి తన ఎత్తైన లావైన గుండ్రని కుచభారంతో కొంచెం అలసత్వం పొంది యున్నది.

శివాదేవి తన నాలుగు చేతుల్లో పాశాంకుశ వరాభయములు దాల్చి విరాజిల్లుతున్నది. శుభశ్రీలు నిండిన శృంగార వేషంతో ఒప్పుతున్నది. మెత్తని తనులతగల కోమలి. అందాల కందాలరాశి. నెపమెన్నని దయామృతపు చూపులు గలది. నవరసాలొలికే కచ్ఛపీ వీణానాదం తియ్యనిది; దానికన్న తేనెవాక మధురం. దానికన్న దేవి పలుకులు ఇంకా మధురం; కోటానుకోట్ల చంద్రసూర్యుల కాంతులతో సహజంగా దేవి స్వయంగా ప్రకాశిస్తుంటుంది. ఎందరో చెలికత్తెలు, దాసీజనం, దేవాంగనలు, దేవతలు తనను చేరి కొలుస్తుండగా దేవి ప్రకాశిస్తుంటుంది. ఇచ్ఛాశక్తి జ్ఞానశక్తి క్రియాశక్తులతో కూడియుంటుంది.

**లజ్జాతుష్టి స్తథా పుష్టిః కీర్తిః కాంతిః క్షమా దయా.**

**బుద్ధిర్ మేధా స్మృతిర్లక్ష్మీ ర్మూర్తిమత్యోఽ౼ంగనాః స్మృతాః।**

**జయా చ విజయా చైవాప్యజితా చాపరాజితా.**

**నిత్యా విలాసినీ దోగ్ధ్రీ త్వఘోరా మంగళానవా।**

**పీఠశక్తయ ఏతా స్తు సేవంతే యాం పరాంబికమ్.**




యస్యా స్తు పార్శ్వభాగే స్తో నిధీ తౌ శంఖపద్మకౌ।
నవరత్నవహా నద్య స్తథా వై కాంచనస్రవాః.
సప్తధాతువహా నద్యో నిధిభ్యాం తు వినిర్గతాః।
సుధాసింధ్వంతగామిన్య స్తాః సర్వా నృపసత్తమ.
సా దేవీ భువనేశానీ తద్వామాంకే విరాజతే।
సర్వేశత్వం మహేశస్య యత్సంగాదేవ నాన్యథా.
చింతామణిగృహ స్యాఽస్య ప్రమాణం శృణు భూమిప।
సహస్ర యోజనాయామం మహాంత స్తత్ప్రచక్షతే.
తదుత్తరే మహాశాలాః పూర్వస్మాద్ద్విగుణాః స్మృతాః।
అంతరిక్షగతంత్వేతన్నిరాధారం విరాజతే.
సంకోచశ్చ వికాసశ్చ జాయతేఽస్య నిరంతరమ్।
పటవత్కార్యవశతః ప్రళయే సర్జనే తథా.
శాలానాంచైవ సర్వేషాం సర్వకాంతి పరావధి।
చింతామణిగృహం ప్రోక్తం యత్ర దేవీ మహోమయీ.
యే యే ఉపాసకాః సంతి ప్రతిబ్రహ్మాండవర్తినః।
దేవేషు నాగలోకేషు మనుష్యేష్వితరేషు చ.
శ్రీదేవ్యా స్తే చ సర్వేఽపి వ్రజంత్య త్రైవభూమిప।
దేవీ క్షేత్రే యో త్యజంతి ప్రాణా న్దేవ్యర్చనే రతాః.
తే సర్వేయాం తి తత్రైవ యత్ర దేవీ మహోత్సవా।
ఘృతకుల్యా దుగ్ధకుల్యా దధికుల్యా మధుస్రవాః.
స్యందంతి సరితః సర్వాస్తథాఽమృతవహాః పరాః।
ద్రాక్షారసవహాః కాశ్చి జ్జంబూరసవహాః పరాః.
ఆమ్రేక్షురసవాహిన్యో నద్యస్తాస్తు సహస్రశః।
మనోరథఫలా వృక్షా వాప్యః కూపా స్తథైవ చ.
యథేష్టపానఫలదా నన్యూనం కించిదస్తి హి।
న రోగఫలితం వాపి జరా వాపి కదాచన.
న చింతా న చ మాత్సర్యం కామ క్రోధాదికం తథా।
సర్వే యువానః సస్త్రీకాః సహస్రాదిత్యవర్చసః.
భజంతి సతతం దేవీం తత్ర శ్రీ భువనేశ్వరీమ్।




కేచిత్సలోకతాపన్నాః కేచిత్సామీప్యతాం గతాః।
సరూపతాగతాః కేచిత్సార్ష్టితాం చ పరేగతాః।
యాయాస్తు దేవతాస్తత్ర ప్రతి బ్రహ్మాండ వర్తినామ్.
సమష్టయః స్థితా స్తాస్తు సేవంతే జగదీశ్వరీమ్।
సప్తకోటి మహామంత్రా మూర్తిమంత ఉపాసతే.
మహావిద్యా శ్చ సకలాః సామ్యావస్థాత్మికాం శివాం।
కారణ బ్రహ్మరూపాం తాం మాయాశబలవిగ్రహామ్.

లజ్జ, తుష్టి, పుష్టి, కీర్తి, కాంతి, క్షమ, దయ, బుద్ధి, మేధ, స్మృతి, లక్ష్మి అనేవాళ్ళు రూపుదాల్చి చెలువొందుతుంటారు. జయవిజయ అజిత అపరాజిత నిత్య విలాసిని దోగ్ధ్రి అఘోర మంగళ నవ– అనే పీఠశక్తులు నిత్యం పరాంబికను సేవిస్తుంటారు. దేవికి ఇరు ప్రక్కల శంఖ పద్మాలనే నిధులు ఎల్లప్పుడు నిండియుంటాయి.

నవరత్నాలు కాంచనం ప్రవహించే నదులు పారుతుంటాయి. ఆ పెన్నిధుల నుండి సప్తధాతు వులు ప్రవహించే నదులు ఎల్లవేళలా ప్రవహిస్తుంటాయి. ఆ నదులన్ని చివరికి అమృత సాగరంలో కలుస్తాయి. ఈ చెలువున శ్రీత్రిభువనేశ్వరి కామేశ్వరి శ్రీ మహాదేవునకు ఎడమవైపున ప్రకాశిస్తుంటుంది. మహాదేవుడు మహాశక్తితో కూడియుండటం వలననే సర్వశక్తుడై అన్ని క్రియలను జరుపుతుంటాడు.

ఇక చింతామణి గృహం ప్రమాణమెంతో విను. అది నూరు ఆమడల వైశాల్యం కలదంటారు. దానికి ఉత్తరం వైపు ఉన్న ప్రాకారం తూర్పుదానికన్న రెండింతలు ఎత్తైనది. అది మహాకాశంలో నిరాధారంగా నిలిచియున్నది. అది నిరంతరం సంకోచవ్యాకోచాల లొందుతుంది. అది సృష్టి మొదలైనప్పుడు కార్యవశమున విప్పిన వస్త్రంవలె వ్యాకోచిస్తుంది. ప్రళయంలో సంకోచిస్తుంది. అన్ని ప్రాకారాలలోని ప్రకాశాల కంటె చింతామణి గృహం పరమశోభలతో పరిపూర్ణమై విరాజిల్లుతుంది.

అటువంటి చింతామణి గృహమందు మహోజ్జ్వల తేజస్వినియైన దేవి ధగద్ధగాయ మానంగా విలసిల్లుతుంటుంది. ప్రతి బ్రహ్మాండ మందలి దేవ, నాగ, మనుష్య లోకము లందలి ఉపాసకులు ఇతర లోకాల్లోని ఉపాసకులు శ్రీదేవీ దివ్య సన్నిధానానికి వచ్చి చేరతారు.

రాజా! శ్రీదేవీ పూజా పరాయణులు దేవీ పుణ్యక్షేత్రాల్లో తమ ప్రాణాలు వదలినచో వారందరూ దేవీ నిత్య మహోత్సవాలు జరిగే దేవి దివ్య సన్నిధానానికి వచ్చి చేరతారు. శ్రీదేవి సన్నిధిలో ఘృతకుల్య మధుకుల్య దధికుల్య దుగ్ధకుల్య అనే నదులు ప్రవహిస్తుం




టాయి. అచటి నదులన్నీ ఎక్కువగా అమృతరస ప్రవాహాలే. అందులో కొన్ని ద్రాక్షరసమును కొన్ని నేరేడుపండ్ల రసమును ప్రవహిస్తుంటాయి. అచ్చట మామిడిపండ్ల రసం, చెఱకు రసం ప్రవహించే నదులు వేలకొలది ఉన్నాయి. కోరిన కోర్కెలు తీర్చే వృక్షాలు వాపీకూపాలు చాలా ఉన్నాయి. వాటి నీరు త్రాగినవారికి అన్ని కోరికలు తీరతాయి. ఇందులో ఎటువంటి సందేహం లేదు. ఆ నీరు త్రాగినవారికి ఎన్నటికి ముసలితనం, రోగం, వెంట్రుకలు నెఱయడం కలగవు. అచటి వారికేనాటికైనా దిగులుగాని మచ్చరంగాని కామక్రోధాలు గాని కలగవు. అక్కడ యువకులు వేయి సూర్యుల ప్రభలతో యువకులై తమ స్త్రీలతో స్వేచ్ఛగా విలాసంగా విహరిస్తుంటారు. వారందరూ శ్రీత్రిభువనేశ్వరీదేవిని సేవిస్తుంటారు. వారిలో కొందరు సాలోక్యముక్తిని, కొందరు సామీప్య ముక్తిని పొందినవారు ఉన్నారు. కొందరు సారూప్యముక్తిని, కొందరు సార్ష్టిముక్తిని పొందినవారు ఉన్నారు. ప్రతి బ్రహ్మాండమందలి ఆ యా దేవతలంతా శ్రీదేవిని చేరి సమష్టిగా దేవి సేవలు చేస్తుంటారు. అచట ఏడుకోట్ల మహామంత్రాలు రూపాలను దాల్చి చేతులు జోడించి దేవిని ఉపాసిస్తుంటాయి. అచ్చట మహావిద్యలన్నీ సామ్యావస్థను పొంది దివ్యకారణ బ్రహ్మరూపిణి మాయాశబల విగ్రహయైన శివా భగవతిని ఉపాసిస్తుంటారు.

**ఇత్థం రాజ న్మయా ప్రోక్తం మణిద్వీపం**
**మహత్తరం న సూర్యచంద్రౌ నో విద్యుత్కోటయోఽగ్ని స్తథైవ చ.**
**ఏతస్య భాసాకోట్యంశకోట్యం శేనాపి తే సమాః।**
**క్వచిద్విద్రుమసంకాశం క్వచిన్మరకతచ్ఛవి.**
**విద్యుద్భానుసమచ్ఛాయం మధ్యసూర్యసమంక్వచిత్।**
**విద్యుత్కోటిమహాధారాసారకాంతితతం క్వచిత్.**
**క్వచిత్సిందూరనీలేంద్రం మాణిక్యసదృశచ్ఛవి।**
**హీరసారమహాగర్భధగద్ధగిత దిక్తటమ్.**
**కాంత్యా దావానలసమం తప్తకాంచనసన్నిభం।**
**క్వచిచ్చంద్రోపలోద్గారం సూర్యోద్గారం చకుత్రచిత్.**
**రత్నశృంగసమాయుక్తం రత్న ప్రాకారగోపురమ్।**
**రత్నపత్రై రత్నఫలై ర్వృక్షైశ్చ పరిమండితమ్.**
**నృత్యన్మయూరసంఘైశ్చ కపోతరణితోజ్జ్వలమ్।**
**కోకిలాకాకలీ లాపైః శుకలాపైశ్చ శోభితమ్.**
**సురమ్యరమణీయాంబులక్షావధిసరోవృతమ్।**
**తన్మధ్యభాగ విలస ద్వికచద్రత్న పంకజైః.**

సుగంధిభిః సమంతాత్తు వాసితం శతయోజనం।

మందమారుత సంభిన్నచలద్ద్రుమసమాకులమ్.

చింతామణి సమూహానాం జ్యోతిషా వితతాంబరమ్।

రత్నప్రభాభి రభితో ధగద్ధగిత దిక్తటమ్.

వృక్షవ్రాత మహాగంధ వాతవ్రాత సుపూరితమ్।

ధూపధూపాయితం రాజన్మణిద్వీపాయుతోజ్జ్వలమ్.

మణిజాలకసచ్ఛిద్రతరలోదరకాంతిభిః।

దిఙ్మోహజనకం చైతద్దర్పణో దరసంయుతమ్.

ఐశ్వర్యస్య సమగ్రస్య శృంగారస్యాఖిలస్య చ।

సర్వజ్ఞతాయాః సర్వాయా స్తేజస శ్చాఖిలస్య చ.

పరాక్రమస్య సర్వస్య సర్వోత్తమగుణస్య చ।

సకలాయా దయాయా శ్చ సమాప్తి రిహ భూపతే.

రాజ్ఞ ఆనంద మారభ్య బ్రహ్మలోకాంత భూమిషు।

ఆనందాయే స్థితాః సర్వే తేఽత్రైవాంతర్భవంతి హి.

ఇతి తే వర్ణితం రాజ న్మణి ద్వీపం మహత్తరమ్।

మహాదేవ్యాః పరం స్థానం సర్వలోకోత్తమోత్తమమ్.

ఏతస్య స్మరణా త్సద్యః సర్వపాపం వినశ్యతి।

ప్రాణోత్క్రమణ సంధౌతు స్మృత్వా తత్రైవ గచ్ఛతి.

అధ్యాయపంచకం త్వేత త్పఠేన్నిత్యం సమాహితః।

భూతప్రేతపిశాచాది బాధా తత్ర భవేన్నహి.

నవీనగృహ నిర్మాణే వాస్తుయాగే తథైవ చ।

పఠితవ్యం ప్రయత్నేన కల్యాణం తేన జాయతే.

ఇతి శ్రీ దేవీభాగవతే మహాపురాణే ద్వాదశస్కంధే ద్వాదశోఽధ్యాయః.

రాజా! ఈ విధంగా నీకు మహా ప్రభావం గల మణిద్వీపమును వర్ణించాను. సూర్య చంద్రులు, మెఱుపు, అగ్ని వీరి కాంతులన్ని కలిసినప్పటికిని మణిద్వీపం కాంతి కోటి కోట్యంశమునకు సాటిరావు. అచట ఒకచోట వైడూర్యకాంతులు,

వేరొకచోట మరకత శోభలు మరొకచోట విద్యుత్కాంతులు, ఇంకొకచోట నడిమింటి సూర్యుని వెలుగులు ఇంకొకచోట విద్యుత్సూర్యుల కాంతులు, ఇంకొక్కచోట నింద్రనీల-మాణిక్య- సింధూర కాంతి పుంజాలు, వేరొకచోట దిక్కులను ధగద్ధగితం చేసే వజ్రాల రాసుల కాంతిపూరములు, ఒకచోట కార్చిచ్చుమంటలు, మరో చోట క్రాగిన బంగారు




కాంతులు, ఇంకోచోట సూర్యకాంత చంద్రకాంత శిలలు వెలుగులు ప్రకాశిస్తుంటాయి. ఒక్కొక్కచో రత్నశిఖరాల రత్నప్రాకార గోపురాలు రత్నఫల పత్రాలు గల వృక్షాలు శోభిల్లు తుంటాయి.

కొన్ని చోట్ల ఆటలాడే నెమళ్ళ గుంపులు, పావురాల తియ్యని ధ్వనులు, నవరాగములొలికే కోయిలల కలరాగాలు, చిలుకల ముచ్చటలు కలిగి సుమనోహరంగా విలసిల్లుతుంటాయి. అచట తియ్యని స్వచ్ఛ జలం గల సరోవరాలు లక్షలున్నాయి. ఆ కొలకులలో రత్నకమలాలు కోట్లకొలది విప్పారి ఒప్పుతుంటాయి.

ఆ సరోవరాలకు నాలుగువైపులా నూఱామడల దూరంలో మలయ మంద మారుత పరిమళాల కెరటాలకు మెల్లమెల్లగా వీచే వృక్షాలు కోకొల్లలుగా ఉన్నాయి. చింతామణుల జ్యోతిఃపుంజాలు ఆకాశంనిండా పరచుకొని ఉంటాయి. అందలి రత్నప్రభలు అన్ని దిక్కులను ప్రకాశింపజేస్తాయి.

రాజా! మణిద్వీపమంతా అనేక విధాల చెట్ల నుండి వెడలే కమ్మతెమ్మరలతో, పలు ధూపములతోనూ దివ్యంగా పరిమళిస్తుంటాయి. అనేక విధాల మణుల రంధ్రాల నుండి బయల్వెడలే రత్నదీప కాంతులు అక్కడి నిలువుటద్దాలపై అపూర్వ శోభలను దిఙ్మోహకంగా వెలార్చుతుంటాయి.

సకల సంపదలకు, సకల రస రాజములకు, సంపూర్ణ సర్వజ్ఞత్వమునకు, సకల తేజము లకు, సర్వ పరాక్రమములకు, సర్వోత్తమ గుణ గణాలకు, దయారస మంతటికి ఈ మణిద్వీపం పరమావధి. ఒక్క మనుష్యానందం మొదలు బ్రహ్మానందం వరకు గల ఆనందా లన్ని ఇచట నెలకొని యున్నాయి. రాజోత్తమా! ఈ ప్రకారంగా నీకు సర్వలోకాల్లోనూ ఉత్తమోత్తమం, మహత్తరం, దివ్యదివ్యం, పరమధామం అయిన శ్రీమహాదేవి మణిద్వీప మును తేటగా వర్ణించాను.

**ఈ మణిద్వీపం ఒక్కమారు తలంచినంతనే గతజన్మల పాపరాసులన్నీ పటాపంచల వుతాయి. ప్రాణం పోయేటప్పుడు మణిద్వీపాన్ని స్మరించినవాడు కేవలం ఆ దేవీ లోకమున ప్రకాశిస్తుంటాడు. ఈ అధ్యాయ పంచకం (8-12) నిత్యం చదివితే భూతప్రేత పిశాచ బాధలు కలగవు.**

**నూతన గృహారంభంలో వాస్తుయాగమున గృహప్రవేశమున దీనిని ప్రయత్నించి చదివితే శుభం కలుగుతుంది.**

**ఇది శ్రీదేవీ భాగవత మహాపురాణమందలి ద్వాదశ స్కంధంలో పన్నెండవ అధ్యాయం.**